ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 నంద్యాల
జిల్లా వార్తలు
శనివారం 4 మే 2024





టీడీపీలోకి బిజ్జం..?



బనగానపల్లె, మే 3 : పాణ్యం మాజీ ఎమ్మెల్యే బిజ్జం పార్థసారథిరెడ్డి తెలుగుదేశం పార్టీలో చేరడానికి రంగం సిద్ధమైంది. ప్రస్తుతం ఆయన వైసీపీలో ఉన్నారు. గత ఎన్నికల్లో కాటసాని రామిరెడ్డి గెలుపు కోసం కృషి చేసినా తగిన గుర్తింపు లేకపోవడంతో టీడీపీలో చేరడానికి సిద్ధమైనట్లు తెలిసింది. టీడీపీ ద్వారా రాజకీయాల్లోకి వచ్చిన బిజ్జం పార్థసారథిరెడ్డి 1999లో జరిగిన ఎన్నికల్లో పాణ్యం నియోజకవర్గం నుంచి పోటీ చేశారు. తన సమీప కాంగ్రెస్ అభ్యర్థి కాటసాని రాంభూపాల్‌రెడ్డిపై 21,246 ఓట్లతో గెలుపొందారు. 2004లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కాటసాని రాంభూపాల్‌రెడ్డి చేతిలో 4,592 ఓట్ల తేడాతో ఓడిపోయారు. అప్పటి వరకు కాటసానికి, బిజ్జంకు ఫ్యాక్షన్ నడిచింది. దీంతో ఓడిపోయిన తరువాత అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సమక్షంలో కాటసాని కుటుంబీకులతో బిజ్జం పార్థసారథిరెడ్డి రాజీ అయ్యారు. 2004 ఓటమి అనంతరం రాజకీయాలకు దూరంగా ఉంటూ హైదరాబాద్‌లో తన వ్యాపారాలు చూసుకుంటున్నారు. 2019లో తిరిగి రాజకీయాల్లోకి వచ్చి వైసీపీలో చేరారు. 2019 ఎన్నికల్లో బనగానపల్లె వైసీపీ అభ్యర్థి కాటసాని రామిరెడ్డికి మద్దతు తెలిపినా గుర్తింపు లేకపోవడంతో టీడీపీలో చేరడానికి రంగం సిద్ధం చేసుకున్నారు. ఈ నెల 4 లేదా 5 తేదీల్లో అవుకు మండలం చెన్నంపల్లెకు వచ్చి టీడీపీ కండువా కప్పుకోనున్నట్టు తెలిసింది.

భారీగా మద్యం స్వాధీనం

గోవా నుంచి ప్రకాశం జిల్లాకు తరలిస్తుండగా పట్టుకున్న పోలీసులు



మద్యం స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

మహానంది, మే 3: నంద్యాల, ప్రకాశం జిల్లాల సరిహద్దు ప్రాంతంలోని గాజులపల్లె అంతర్ జిల్లా చెక్‌పోస్టు వద్ద శుక్రవారం సాయంత్రం పోలీసులు భారీగా మద్యం స్వాధీనం చేసుకున్నారు. రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన లారీలో దాదాపు రెండు వేల మద్యం కేసులను పట్టుకున్నారు. నంద్యాల నుంచి గిద్దలూరు వైపు వెళ్తున్న లారీని మహానంది మండలం గాజులపల్లె సమీపంలో అంతర్ జిల్లా చెక్‌పోస్టు వద్ద తనిఖీ చేశారు. ఇందులో భారీగా మద్యం ఉండడంతో పోలీసులు పట్టుకున్నారు. ఈ మద్యాన్ని గోవా నుంచి ప్రకాశం జిల్లాకు రవాణ చేస్తున్నట్టు తెలిసింది. జిల్లాలో ఇంత భారీ స్థాయిలో మద్యం పోలీసులు స్వాధీనం చేసుకోవడం ఇదే ప్రథమం. నంద్యాల డీఎస్పీ రవీంద్రనాథరెడ్డి, సీఐ శివకుమార్‌రెడ్డి, ఎస్‌బీ సీఐలు వెంకటేశ్వరరావు, సూర్య మౌళి, మహానంది ఎస్సై నాగేంద్రప్రసాద్ ఇందులో ఉన్నారు. లారీ డ్రైవరును అదుపులోకి తీసుకొని వివరాలు సేకరిస్తున్నారు.

ఉరవకొండ ఎంపీడీవో డిస్మిస్!

గతంలో ప్యాపిలిలో పని చేసిన అమృత్‌రాజ్

అనంతపురం విద్య, మే 3: అనంతపురం జిల్లా ఉరవకొండ ఎంపీడీఓ అమృత్‌రాజ్‌ను ఉద్యోగం నుంచి డిస్మిస్ చేశారు. పంచాయతీరాజ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్ నుంచి ఇటీవల ఉత్తర్వులు జారీ అయ్యాయి. గతంలో ఆయన నంద్యాల జిల్లాలో ప్యాపిలి ఎంపీడీవోగా పని చేశారు. ఆ సమయంలో ఉపాధి పనుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం, నిధులను దుర్వినియోగం చేయడంతో ఆయనను డిస్మిస్ చేశారు. ఈ మేరకు ప్రభుత్వం నుంచి అనంతపురం కలెక్టరేట్‌కు సమాచారం వచ్చింది. పంచాయతీరాజ్ కమిషనర్ నుంచి జడ్పీకి ఉత్తర్వులు రావాల్సి ఉంది. జడ్పీ డిప్యూటీ సీఈఓగా పని చేస్తున్న ఆయనపై గత ఏడాది సైతం ఉన్నఫలంగా సస్పెన్షన్ వేటు వేశారు. ఆయన కోర్టును ఆశ్రయించడంతో సస్పెన్షన్ ఎత్తివేశారు. మరోసారి ఆయనపై కక్షగట్టి వేటు వేసినట్టు జడ్పీ వర్గాల్లో చర్చ సాగుతోంది. అమృత్ రాజ్ అనారోగ్య కారణాలతో ప్రస్తుతం సెలవులో ఉన్నారు. ఇప్పటి వరకు ఆయనకు ఉత్తర్వులు అందలేదని సమాచారం.

ఉద్యోగులకు నోటీసులు

శ్రీశైలం, మే 3: వివిధ ప్రభుత్వ సంస్థల్లో విధులు నిర్వహిస్తున్న పలువురు ఉద్యోగులు ఎన్నికల ప్రచారంలో పాల్గొని నోటీసులు అందుకున్నారు. ఇందులో ఎనిమిది మంది శ్రీశైలం దేవస్థానం ఉద్యోగులు కాగా, తపాలశాఖ, పర్యాటక శాఖల్లో ఒకరు చొప్పున శాశ్వత, ఒప్పంద ఉద్యోగులు టీడీపీ ప్రచారంలో పాల్గొన్నారని స్థానిక వైసీపీ నాయకుడు ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్‌కు లేఖ ద్వారా ఫిర్యాదు చేశారు. దేవస్థానం ఈవో డి. పెద్దిరాజు పలువురు ఉద్యోగులకు సంజాయిషీ ఇవ్వాలని నోటీసులు జారీ చేశారు. ఇప్పటికే ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తూ వైసీపీ ప్రచారంలో పాల్గొన్న పలువురు సిబ్బందిపై వేటు పడింది.

ఎవరు గెలిచినా మీదే గెలుపు

జిల్లా స్థాయి కూపన్ నెం.2

పాఠకుని పూర్తి పేరు : ....

డోరు నెంబరు : .... వీధి పేరు : ....

గ్రామం/పట్టణం : .... మండలం : ....

జిల్లా : .... పోస్టల్ పిన్‌కోడ్ : .... ఫోన్ నెం. ....

కర్నూలు ఉమ్మడి జిల్లాలోని ఒకొక్క అసెంబ్లీ స్థానంలో ఎవరు గెలుస్తారు అనేది, మీరు ఊహించిన అభ్యర్థి ఎదురుగా గడిలో టిక్ ✔ మార్క్ చేయండి.

నియోజకవర్గం పేరు	NDA కూటమి	YSRCP	కాంగ్రెస్	ఇతరులు
1. ఆదోని				
2. ఆలూరు				
3. పత్తికొండ				
4. కోడుమూరు (ఎస్సీ)				
5. ఎమ్మిగనూరు				
6. కర్నూలు				
7. మంత్రాలయం				
8. ఆళ్ళగడ్డ				
9. బనగానపల్లె				
10. డోన్				
11. శ్రీశైలం				
12. నందికొట్కూరు (ఎస్సీ)				
13. నంద్యాల				
14. పాణ్యం				
మొత్తం:				

కూపన్ పూర్తి చేసి వెంటనే ఈ దిగువ అడ్రస్‌కు పోస్టు ద్వారా గానీ, పర్సనల్‌గా గానీ పంపే ఏర్పాటు చేయండి

ఆంధ్రజ్యోతి కార్యాలయము : ఆంధ్రజ్యోతి బిల్డింగ్స్, సర్వే నెం : 1/1 & 1/2, ఇండస్ స్కూల్ దగ్గర, గుత్తి రోడ్డు, పందిపాడు గ్రామ పంచాయితీ, కల్లూరు (మం.), కర్నూలు -518002.

యువగళం సభకు తరలివచ్చిన యువత



వైసీపీ తప్పుడు ప్రచారం

- ప్రజల కష్టాల నుంచి వచ్చిందే కూటమి మేనిఫెస్టో
- టీడీపీ అధికారంలోకి రాగానే ఉద్యోగాల భర్తీ
- జగన్ ఓటమి ఖాయమైంది
- కూటమి అభ్యర్థులను గెలిపించండి
- అసమర్థ సండే ఎమ్మెల్యేను సాగనంపండి
- నంద్యాల 'యువగళం'లో నారా లోకేశ్
- భారీగా తరలి వచ్చిన యువత





ప్రసంగిస్తున్న నారా లోకేశ్

నంద్యాల (నూనెపల్లె), మే 3: టీడీపీ తీసుకొచ్చిన మేనిఫెస్టోపై వైసీపీ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ఓటర్లు తిప్పికొట్టాలని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. ముస్లింలను పట్టించుకోలేదన్న వైసీపీ అసత్య ప్రచారాలను నమ్మవద్దన్నారు. టీడీపీ మైనారిటీలకు అండగా ఉంటుందని, అధికారంలోకి రాగానే యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. నంద్యాల పట్టణంలో శుక్రవారం యువగళం పేరుతో నారా లోకేశ్ యువతతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సభకు యువత వేలాదిగా తరలివచ్చారు. ఈ సందర్భంగా నారా లోకేశ్ మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చాక సీఎం జగన్ రాష్ట్రానికి రాజధాని లేకుండా చేశాడన్నారు. ఉద్యోగాలు అడుగుతున్న యువతకు గంజాయి అలవాటు చేసి ఒక తరాన్ని నాశనం చేస్తున్నాడన్నారు. రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసింది చాలక ప్రజల ఆస్తులను కొట్టేసేందుకు యత్నిస్తున్నాడని దుయ్యబట్టారు. పోలవరాన్ని, అమరావతిని నాశనం చేశాడని, పేదలకు చంద్రబాబు టిడ్కో ఇళ్లు కడితే వాటిని జగన్ కూల్చేశాడన్నారు. కూటమిపై జగన్ నిందలు వేస్తున్నాడని, సీఏఏ, ఎన్నార్సీకి మద్దతునిచ్చిన జగన్ బయటకు వచ్చి టీడీపీ మైనారిటీలను ఇబ్బంది పెడుతుందని చెబుతున్నాడన్నారు. వాస్తవంగా వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నంద్యాలలో సలాం కుటుంబం ఆత్మహత్య చేసుకుందన్నారు. ఆ ఘటన తనను కలచివేసిందన్నారు. గత ఐదేళ్లలో దళితులపై అంతులేని దాడులు పెరిగిపోయాయని చెప్పారు. నడిరోడ్డుపై కానిస్టేబుల్‌ను హత్య చేస్తే ఆ కుటుంబానికి ఇంత వరకు న్యాయం జరగలేదని గుర్తు చేశారు. రాయలసీమలో ఒక్క పెండింగ్ ప్రాజెక్టును పూర్తి చేయలేదన్నారు.

యువతను ఆదుకుంటా

ఉద్యోగ నోటిఫికేషన్‌తో పాటు, పరిశ్రమలను తీసుకువచ్చి ప్రైవేటు రంగంలో కూడా ఉద్యోగాలను కల్పిస్తామని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ యువతకు హామీనిచ్చారు. తాను యువగళం పాదయాత్రలో తిరిగినపుడు ప్రజల కష్టాలను చూసి వారి ఇబ్బందులను తీర్చేందుకు మేనిఫెస్టోను తీసుకువచ్చామన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక హామీలన్నీ నెరవేరుస్తామన్నారు. ముఖ్యంగా మెగా డీఎస్సీ విడుదల చేస్తామన్నారు. 20 లక్షల ఉద్యోగాలను తీసుకువస్తామని, పరిశ్రమలను తీసుకువచ్చి ఉపాధి కల్పిస్తామన్నారు. రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా మారుస్తామని, పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేస్తామన్నారు. 90 సబ్సిడీతో డ్రిప్, రెన్యూవల్ ఎనర్జీ, స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్ది పాడిరైతులను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. చంద్రబాబునాయుడు హయాంలో ప్రతిరోజు పెట్టుబడులకు సంబంధించిన వార్తలు వచ్చేవన్నారు. ముఖ్యంగా ఓర్వకల్లులో విమానాశ్రయం, జైన్ ఇరిగేషన్, మెగా సీడ్ పార్కు, సోలార్ పవర్, ఉర్దూ యూనివర్సిటీ వంటి వాటిని తీసుకువచ్చాడని గుర్తు చేశారు. కానీ 22 మంది ఎంపీలను ఇస్తే జగన్ ఏం చేశాడని, మెగా డీఎస్సీ, కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీ అన్నాడు. కానీ ఈ ఐదేళ్ళలో ఒక జాబ్‌లెస్ క్యాలెండర్ ఇచ్చారని ఎద్దేవా చేశారు.

సండే ఎమ్మెల్యేను సాగనంపండి

నంద్యాలలో పేదలకు పదమూడు వేల టిడ్కో గృహాలను టీడీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించిందని, అయితే అసమర్థ ఎమ్మెల్యే శిల్ప రవిచంద్ర కిషోర్ రెడ్డి వాటిని పూర్తిచేసి ఎందుకు పంపిణీచేయలేదో ప్రజలకు చెప్పాల్సిన అవసరముందని ప్రశ్నించారు. నంద్యాలకు ఒక్క పరిశ్రమను కూడా తీసుకరాని సండే ఎమ్మెల్యే ఎందుకని, రానున్న ఎన్నికల్లో ఆయన్ను సాగనంపాలని పిలుపునిచ్చారు. ఇక శిల్పా రవి పాలనల నంద్యాల నియోజకవర్గంలో 15 హత్యలు జరిగాయని, ప్రశాంత నంద్యాల కోసం ఫరూక్‌ను గెలిపించాలని, అలాగే ఎంపీ అభ్యర్థిగా బైరెడ్డి శబరికి ఓటు వేసి పార్లమెంటుకు పంపించాలని కోరారు. టీడీపీకి అధికారంలోకి వస్తే ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి కల్తీ విత్తనాలపై చర్యలు తీసుకుంటామన్నారు. ఇక్తే సైకో జగన్ పాలనలో అన్ని రంగాలు నిర్వీర్యం అయ్యాయని, టీడీపీ ప్రభుత్వం రాగానే వాటికి మరమ్మతులు చేసి గాడిన పెడతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఎంపీ ఎమ్మెల్యే అభ్యర్థులు బైరెడ్డి శబరి, ఎన్ఎండీ ఫరూక్, మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులతో నారా లోకేశ్



నారా లోకేశ్ ప్రసంగాన్ని వింటున్న యువతీ, యువకులు



యువగళం సభలో యువతుల కేరింతలు



యువనేతను సెల్‌ఫోన్లలో బంధిస్తున్న దృశ్యం



యువతీ, యువకులతో నారా లోకేశ్ సెల్ఫీ

మృత్యువులోనూ వీడనిబంధం

వడదెబ్బ సోకి అన్నదమ్ముల మృతి



పెద్ద సుంకన్న(ఫైల్)



అంజనేయ (ఫైల్)

మంత్రాలయం, మే 3: కర్నూలు జిల్లాలో ఎండలు ఠారెత్తిస్తున్నాయి. ఎండలకు తోడు వీస్తున్న వడగాల్పులు ప్రజల ప్రాణాలను హరిస్తున్నాయి. శుక్రవారం మంత్రాలయంలో వడదెబ్బ సోకి అన్నదమ్ములు మృతి చెందారు. మంత్రాలయం మండలంలోని మాధవరం గ్రామానికి చెందిన బోయ పెద్ద సుంకన్న (60), బోయ ఆంజనేయ (52) ఇద్దరు సోదరులు. వీరు రెండు రోజుల క్రితం ఎండ తీవ్రతకు అస్వస్థతకు గురయ్యారు. పెద్ద సుంకన్న శుక్రవారం ఉదయం మృతి చెందగా.. తమ్ముడు ఆంజనేయ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆ వెంటనే మృతి చెందాడు. ఇద్దరూ రెండు గంటల వ్యవధిలో చెందడంతో వారి కుటుంబంలో విషాద చాయలు అలుముకున్నాయి. పెద్ద సుంకన్నకు భార్య లక్ష్మీ, ఇద్దరు కొడుకులు, ఇద్దరు కుమార్తెలు సంతానం. ఆంజనేయకు భార్య నరసమ్మ, ఒక కొడుకు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

రుద్రవరంలో యువకుడు..

రుద్రవరం: రుద్రవరం మండలంలోని యల్లావత్తుల గ్రామానికి చెందిన పెద్దకుళ్లాయి (25) అనే యువకుడు వడదెబ్బ సోకి శుక్రవారం సాయంత్రం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. గ్రామంలో వ్యవసాయ పనులు చేసుకుని ఆయన కుటుంబానికి ఆసరాగా ఉండేవాడు. కాగా పెద్దకుళ్లాయి అవివాహితుడు.



జన కేతనం

బరిలో వీరు...



సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి మరో వారం రోజుల్లో ముఖ్యమైన ఘట్టం ఓటింగ్ ప్రక్రియ జరగనుంది. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని పార్టీల అభ్యర్థులు ప్రచారాన్ని వేగవంతం చేశారు. వీరితో పాటు బరిలో తాము కూడా ఉన్నామంటూ స్వతంత్రులు తమ స్థాయిలో ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. నంద్యాల లోక్‌సభ స్థానానికి 31 మంది, ఏడు అసెంబ్లీ స్థానాలకు 140 మంది పోటీలో మిగిలారు. అత్యధికంగా నంద్యాల, బనగానపల్లె అసెంబ్లీ నుంచి 28 మంది చొప్పున పోటీలో ఉన్నారు. ఇక నందికొట్కూరు(ఎస్సీ) సెగ్మెంట్ నుంచి 18, ఆత్మకూరులో 18, ఆళ్లగడ్డ లో18, డోన్‌లో 16, పాణ్యంలో 14 మంది చొప్పున పోటీలో వున్నారు. మొత్తంగా ప్రధాన రాజకీయ పక్షాలైన టీడీపీ, వైసీపీ, కాంగ్రెస్, సీపీఐ వంటి నాలుగైదు పార్టీల అభ్యర్థులను మినహాయిస్తే మిగిలిన వారంతా గుర్తింపు లేని పార్టీల తరపున, ఇండిపెండెంట్లుగా పోటీ చేస్తున్న వారే.

- నంద్యాల, మే 3 (ఆంధ్రజ్యోతి)

నంద్యాల (ఎంపీ)




టీడీపీ	వైసీపీ	కాంగ్రెస్	ఇతరులు
బైరెడ్డి శబరి	పోచా బ్రహ్మానందరెడ్డి	లక్ష్మీ నరసింహ యాదవ్	స్వతంత్రులు : 18 బీఎస్పీ: చిన్న మౌలాలి ఎస్‌డీపీఐ : హఫీజ్ అతావుల్లా ఖాన్ ఇతర పార్టీలు : 8 మొత్తం : 31

నంద్యాల (అసెంబ్లీ)




టీడీపీ	వైసీపీ	కాంగ్రెస్	ఇతరులు
ఎన్ఎండీ ఫరూక్	శిల్పా రవిచంద్రకిశోర్ రెడ్డి	గోకుల్ కృష్ణారెడ్డి	స్వతంత్రులు : 12 బీఎస్పీ: వెంకటరమణ ఎస్‌డీపీఐ : షేక్ మహ్మద్ ఫాజిల్ ఇతర పార్టీలు : 11 మొత్తం : 28

నందికొట్కూరు (ఎస్సీ)




టీడీపీ	వైసీపీ	కాంగ్రెస్	ఇతరులు
గిత్తా జయసూర్య	ధారా సుధీర్	తోగూరు ఆర్థర్	స్వతంత్రులు : 4 బీఎస్పీ : గద్దల లాజర్ జైభారత్ నేషనల్ పార్టీ : బోరెల్లి వెంకటరాముడు ఇతర పార్టీలు : 9 మొత్తం : 18

శ్రీశైలం



టీడీపీ	వైసీపీ	కాంగ్రెస్	ఇతరులు
బుడ్డా రాజశేఖర్ రెడ్డి	శిల్పా చక్రపాణి రెడ్డి	ఏఎస్ ఇస్మాయిల్	స్వతంత్రులు : 5 బీఎస్పీ: పల్లె చంద్రశేఖర్ ఎస్‌డీపీఐ: యూనస్ ఇతర పార్టీలు: 8 మొత్తం : 18

పాణ్యం



టీడీపీ	వైసీపీ	సీపీఐ(ఎం)	ఇతరులు
గౌరు చరితా రెడ్డి	కాటసాని రాంభూపాల్ రెడ్డి	గౌస్ దేశాయ్	స్వతంత్రులు : 2 బీఎస్పీ: రామశేషయ్య అన్న వైఎస్సార్ పార్టీ : హరుణ్ జైభారత్ నేషనల్ పార్టీ : రఘురామిరెడ్డి ఇతర పార్టీలు : 6 మొత్తం : 14

ఆళ్లగడ్డ



టీడీపీ	వైసీపీ	కాంగ్రెస్	ఇతరులు
భూమా అఖిలప్రియ	గంగుల బ్రిజేంద్రనాథ్ రెడ్డి	బరగొడ్ల హుసేన్ బాషా	స్వతంత్రులు : 7 బీఎస్పీ: వరికూటి హన్నమ్మ ఇతర పార్టీలు : 7 మొత్తం : 18

బనగానపల్లె



టీడీపీ	వైసీపీ	కాంగ్రెస్	ఇతరులు
బీసీ జనార్దన్ రెడ్డి	కాటసాని రామిరెడ్డి	గూటం పుల్లయ్య	స్వతంత్రులు : 22 బీఎస్పీ : జి.చిన్నయ్య ఇతర పార్టీలు : 2 మొత్తం : 28

డోన్



టీడీపీ	వైసీపీ	కాంగ్రెస్	ఇతరులు
కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి	బుగ్గన రాజేంద్రనాథ్	గార్లపాటి మద్దిలేటి	స్వతంత్రులు : 10 బీఎస్పీ : రుద్రవరం రాముడు ఇతర పార్టీలు : 10 మొత్తం : 16

ఎవరడిగినా మా ఓటు మీకే..!



నందికొట్కూరు/చాగలమర్రి, మే 3: ఎన్నికల వేళ విచిత్ర పరిస్థితులు నెలకొన్నాయి. ఏ పార్టీ నాయకుడు పిలిచినా ర్యాలీలు, ప్రచారానికి హాజరవుతున్నారు. ఈ విషయంపై ప్రత్యర్థి నేత ప్రశ్నిస్తే ఇంటికి వచ్చి పిలిచాడు. కానీ మా ఓటు మాత్రం మీ పార్టీకే బాబు అని సమాధానం చెబుతున్నారు. దీంతో వారు ఎవరికి ఓటు వేస్తారోనన్న అయోమయం అభ్యర్థుల్లో నెలకొంది. గత ఎన్నికల వరకూ లేని ఈ విచిత్ర పరిస్థితి ప్రస్తుత ఎన్నికల్లో నెలకొనడంతో ఓటర్ల నాడి పట్టలేక అభ్యర్థులు తలలు పట్టుకుంటున్నారు. ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా తమకు ఇబ్బంది ఉండకూడదన్న ఉద్దేశంతోనే ఈ పరిస్థితి నెలకొందని చెప్పవచ్చు. ఇటువంటి జాబితాలో ప్రస్తుతం పురుషులతో పాటు మహిళలు కూడా చేరిపోయారు. ఇప్పటికే పట్టణంతోపాటు గ్రామాల్లో రాజకీయ వాతావరణం వేడెక్కిన నేపథ్యంలో ప్రచారం ఊపందుకుంది. టీడీపీ, వైసీపీ, కాంగ్రెస్ నేతల ప్రచారం పోటాపోటీగా సాగుతోంది. అభ్యర్థులు పర్యటిస్తున్న సమయంలో ఘనంగా ఆహ్వానం పలకాలనే ఉద్దేశంతో స్థానిక నాయకులు ముందు రోజే ఇంటింటికీ వెళ్లి ప్రచారానికి రావాలని కోరుతున్నారు. దీంతో ఆహ్వానాన్ని మన్నించిన కొందరు నాయకుల ప్రచారాలకు బహిరంగంగా వెళ్లి మద్దతు పలికి వారితో ర్యాలీలు, ప్రచారాల్లో పాల్గొంటున్నారు. ప్రచారంలో తిరిగే వారి వల్ల లోలోపల ఆందోళన చెందుతున్నారు. సర్వేలు చేసేవారు కూడా ఇటువంటి వారిని ప్రశ్నిస్తే పార్టీలదేముంది ఎన్నికల రోజున మాకు ఇష్టం వచ్చిన వారికి ఓటు వేస్తాం అంత వరకు ఏ ఒక్క పార్టీ నేతలకు చెడ్డ కాకుండా ఉండకూడదు కదా అని సమాధానాలు చెబుతున్నారు. దీంతో రాజకీయ పార్టీ నేతలకు దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది.

ఖైదీలకు కూడా ఓటు హక్కు..!!



ఖైదీలకు కూడా ఓటు హక్కు ఉంది. శిక్ష అనుభవిస్తున్న ఖైదీలు ప్రీవెంక్యూ డిటర్మినేషన్ పద్ధతిలో ఓటు వేయవచ్చు. తమ ఓటు ఉన్న నియోజకవర్గం పేరును సూచిస్తూ ఓటర్లమని గుర్తింపు పొందుపరుస్తూ, పోలింగ్ బూత్, ఓటరు క్రమ సంఖ్యతో ఓటు వేసే అవకాశం కల్పించాలని రాత పూర్వకంగా సదరు జైళ్ల అధికారులను కోరాలి. ఖైదీలు ఏ నియోజకవర్గంలో ఓటరుగా ఉంటారో ఆయా నియోజకవర్గాల నుంచి పోస్టల్ బ్యాలెట్లను తెప్పించి ఓటు వేసే అవకాశం కల్పిస్తారు.


- నంద్యాల టౌన్

ఓటు వేసి ఉంటే ఒట్టు




ఆ ఇద్దరి నాయకుల గుప్పిట్లో పది గ్రామాలు

బనగానపల్లె, మే 3 : ఫ్యాక్షన్ నాయకులు రాజకీయాల్లోకి ప్రవేశించడంతో నాలుగు దశాబ్దాలుగా ఆ గ్రామాల ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకోవడమే మరిచిపోయారు. ఆ గ్రామ పెత్తందారులు, ఫ్యాక్షన్ నాయకులు చెప్పిందే ఆ గ్రామాల్లో వేదం. గెలుపు ఓటములను నిర్ణయించేది అత్యధిక ఓట్లు ఉన్న బనగానపల్లె మండలమే. తర్వాత స్థానంలో అవుకు మండలం ఉంటుంది. అయితే అవుకు మండలంలోని పలు గ్రామాలు నాయకుల గుప్పిట్లో ఉండిపోయాయి. అవుకు మండలంలోని గుండ్ల శింగవరం, అన్నవరం, గడ్డమేకలపల్లె, కొట్టాల, కోనాపురం, లింగంబోడు, నిచ్చెనమెట్ల గ్రామాలు కాటసాని కుటుంబీకుల ఆధ్వర్యంలో పని చేస్తున్నాయి. అలాగే ఉప్పలపాడు, కొండమనాయునిపల్లె, జూనూతల, పిక్కిళ్లపల్లె తండా, మారెమడుగుల గ్రామాలు చల్లా వర్గీయుల ఆధిపత్యంలో నడుస్తున్నాయి. ఈ గ్రామాల్లో ఎన్నికలు ఏక చత్రాధిపత్యంగా జరుగుతున్నాయి. ఇక్కడి ప్రజలకు ఓటు వేయడమనేదే తెలియదంటే అతిశయోక్తి కాదు. ఆ గ్రామ పెత్తందారుల అనుచరులు గతంలో ఎన్నికల బూత్ వద్దకు వెళ్లి ఎవ్వరినీ రానివ్వకుండా రిగ్గింగ్ చేసే వారు. ప్రస్తుతం ఈవీఎంలు రావడంతో రీసైక్లింగ్ చేస్తున్నారు. ఓటు వేసిన వారే వచ్చి మళ్లీ మళ్లీ వేసి పోతుంటారు. ప్రత్యర్థి పార్టీ ఏజెంట్లను పోలింగ్ కేంద్రాల్లో కూర్చోనివ్వరు. ఒకవేళ కూర్చున్నా బలవంతంగా పోలింగ్ కేంద్రం నుంచి బయటకు లాగి పడేస్తారు. సుమారు 9 వేలకు పైగా ఓట్లను అవుకు మండలంలో రిగ్గింగ్ చేసుకుంటున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఎన్నికల కమిషన్ స్వేచ్ఛగా ఎన్నికలు జరుపుతున్నామని చెబుతున్నా ఇక్కడ మాత్రం ఆ పరిస్థితి కనిపించడం లేదు. అవుకు మండలంలోని ఉప్పలపాడు, జూనుంతల, పిక్కిళ్లపల్లె తండా, మారెమడుగుల, కొండమనాయినిపల్లె గుండ్ల శింగవరం, నిచ్చెనమెట్ల, కోనాపురం, రామవరం, లింగంబోడు, గోకుల దిన్నె, అన్నవరం గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాల్లో 9,332 మంది ఓటర్లు ఉన్నారు. ఇవన్నీ గంపగుత్తగా ఒకే పార్టీకి వేసుకోవడం సర్వసాధారణమైపోయింది.



పోలింగ్ అధికారులను భయపెట్టి..

ఈ గ్రామాల్లో పోలింగ్ విధులకు హాజరయ్యే ఎన్నికల అధికారులు ముందు రోజే ఎన్నికల సామగ్రితో గ్రామాలకు చేరుతారు. దీంతో ఆయా గ్రామ పెత్తందార్లు వార్లను ముందుగానే బెదిరించే కార్యక్రమాలు పూర్తి చేస్తారు. తమకు అడ్డువస్తే చంపేస్తామని హెచ్చరిస్తారు. దీంతో పోలింగ్ అధికారులు కిమ్మనే వారు కాదు. ఈవిషయాన్ని ఎన్నికల కమిషన్ దృష్టికి కూడా తీసుకువెళ్లకుండా అంతా సజావుగా జరిగినట్లు పోలింగ్ అధికారులకు నివేదికలు అందించేవారు. ఇక్కడ రీసైక్లింగ్, రిగ్గింగ్ జరుగుతుందని ఉన్నతాధికారులకు తెలిసినా వారు ఇప్పటి వరకు చర్యలు తీసుకున్నది లేదు. ఇప్పటికైనా ఎన్నికల కమిషన్ ఈ గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించి అందరూ ఓటు వేసేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.



హలో...నన్ను గుర్తుపట్టారా..

కల్లూరు, మే 3: ఓటరు దేవుళ్లకు నమస్కారం..మీకోసం మళ్లీ వచ్చాను..నన్ను గుర్తుపట్టారా..నేనేనండీ ఈవీఎంని...మళ్లీ మీ ముందుకు వస్తున్నాను. నేను ఎలా ఉపయోగపడతానో ఇప్పటికే అధికారులు చేప్పే ఉంటారు.. మీరు ఏ అభ్యర్థికి ఓటు వేయాలని అనుకుంటున్నారో అతని పేరును బాగా పరిశీలించండి. ఓ నిర్ణయానికి వచ్చాక మీరు ఓటు వేయండి. మీ ఓటును మీరే వేయండి.. ఇతరులకు అవకాశం ఇవ్వవద్దు. మీరు మీటనొక్కినప్పుడు కీ శబ్దం వస్తుంది. అలా శబ్దం వస్తేనే ఓటు వేసినట్లు సరేనా..ఉండనా మరి...బాగా గుర్తుంచుకోండి. ఇట్లు మీ ఈవీఎం.

అదనపు బ్యాలెట్ యూనిట్లు కేటాయింపు

కర్నూలు(కలెక్టరేట్), మే 3: కర్నూలు పార్లమెంటు స్థానానికి సప్లిమెంటరీ ఈవీఎం ర్యాండమైజేషన్ ద్వారా అదనపు బ్యాలెట్ యూనిట్ కేటాయింపు ప్రక్రియను శుక్రవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో రాజకీయ పార్టీ ప్రతినిధుల సమక్షంలో జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డా.జి.సృజన నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ 16 కంటే (నోటాతో కలిపి) ఎక్కువ మంది అభ్యర్థులు కర్నూలు పార్లమెంటు స్థానాలకు పోటీల్లో ఉండడం వల్ల అదనపు (రెండవ) బ్యాలెట్ యూనిట్లు జిల్లాకు రావడం జరిగిందన్నారు. బ్యాలెట్ యూనిట్లు బెల్ ఇంజనీర్లు ఫస్ట్ లెవల్ చెక్ పూర్తి చేయడం జరిగిందన్నారు. సమావేశంలో అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణి, డీపీవో నాగరాజు నాయుడు, బీజేపీ ప్రతినిధి సాయిప్రదీప్, టీడీపీ ప్రతినిధి ఎల్‌వీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పెరిగిపోతున్న అభ్యర్థుల ఖర్చు



కర్నూలు(కలెక్టరేట్), మే 3: మొట్టమొదటి సార్వత్రిక ఎన్నికల్లో లోకసభ అభ్యర్థులు గరిష్ఠంగా రూ.25వేల వరకు ఖర్చు చేయడానికి అనుమతించారు. కొన్ని ఈశాన్య రాష్ట్రాల్లో ఈ పరిమితి రూ.10వేలు మాత్రమే. 1971 సంవత్సరంలో వ్యయ పరిమితి దాదాపు అన్ని రాష్ట్రాల్లో రూ.35 వేలకు పెరిగింది. 1996 సంవత్సరంలో ఒక్కో అభ్యర్థి ఎన్నికల వ్యయం రూ.4.5 లక్షలకు చేరింది. 1998 సంవత్సరంలో రూ.15 లక్షలకు పెంచారు. 2004 సంవత్సరంలో రూ.25 లక్షలకు పెంచారు. 2014లో లోక్‌సభ అభ్యర్థులు గరిష్ఠ వ్యయ పరిమితిని రూ.70 లక్షలుగా నిర్ణయించారు. 2024 సంవత్సరంలో పెద్ద రాష్ట్రాలకు రూ.95 లక్షలకు చిన్న రాష్ట్రాలకు రూ.75 లక్షలకు చేరింది. 2019 సంవత్సరంలో ఎన్నికల్లో అన్ని పార్టీలకు కలిపి దాదాపు రూ.50వేల కోట్లు ఖర్చు చేసినట్లు ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. మొట్టమొదటి సార్వత్రిక ఎన్నికల్లో 401 స్థానాలకు 53 పార్టీల నుంచి 1,874 మంది అభ్యర్థులు పోటీ పడ్డారు. అప్పట్లో ఈసీ 1.96 లక్షల పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసింది. 2019 ఎన్నికల్లో 543 లోక్‌సభ స్థానాలకు 673 పార్టీల నుంచి ఎనిమిది వేల మందికి పైగా అభ్యర్థులు బరిలో నిలిచారు. ఈ ఎన్నికల కోసం పది లక్షలకుపైగా పోలింగ్ కేంద్రాలు ఏర్పడ్డాయి. 2024 ఎన్నికల్లో రాజకీయ పార్టీల సంఖ్య దాదాపుగా 2,500కు పెరిగింది. పోటీ చేసే పార్టీలు, అభ్యర్థుల సంఖ్య పెరిగే కొద్ది ఎన్నికల వ్యయం అధికమవుతోంది. 1951-52 సంవత్సరంలో మొట్టమొదటి సార్వత్రిక ఎన్నికలకైన వ్యయం రూ.10.45 కోట్లు, 2014 సంవత్సరంలో 16వ సార్వత్రిక ఎన్నికల నాటికి అది రూ.3,800 కోట్లకు మించిపోయింది. 2019 సంవత్సరంలో ఎన్నికల ఖర్చు రూ.55వేల కోట్లకు చేరింది. 2024 సంవత్సరం ఎన్నికల వ్యయం రూ.లక్ష కోట్లు దాటిపోతుందని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. ప్రపంచంలోనే అత్యధిక ఎన్నికల ఖర్చు ఇదే..!



చెరుకుబండి వద్ద చెరుకు రసం తీస్తున్న భరత్

ఎన్నికల వేళ...

ఎన్నికల వేల రాజకీయ పార్టీల అభ్యర్థులు ప్రచారపర్వంలో తమదైన శైలిలో దూసుకుపోతున్నారు. ఓటర్లను ఆకట్టుకునేలా ప్రజాక్షేత్రంలో ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. అందులో భాగంగా శుక్రవారం కర్నూలు నియోజకవర్గ అభ్యర్థి టీజీ భరత్ నగరంలోని ఎన్ఆర్‌పేటలో పర్యటించారు. ఈ సందర్భంగా వ్యాపారులతో మాట్లాడుతూ వారి కష్టాలను తెలుసుకున్నారు. వారితో మమేకమై ఓ చోట చెరుకుబండి వద్ద చెరుకు రసం తీశారు. మరో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ వద్దకు వెళ్లి కాసేపు నూడిల్స్ వేశారు. ఇలా తనదైన శైలిలో ప్రజలను ఆకట్టుకుంటున్నారు.

-కర్నూలు అర్బన్



ఎన్ఆర్ పేటలో నూడిల్స్ వేస్తూ...



పాణ్యం మండలం సుగాలిమెట్ట తండాలో ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ అసెంబ్లీ అభ్యర్థి గౌరు చరిత



అభ్యర్థులు వీరే..

మరో వారం రోజుల్లో సార్వత్రిక ఎన్నికల ఓటింగ్ జరగనుంది. మే 13వ తేదీన జరిగే ఓటింగ్ కోసం ఎన్నికల కమిషన్ ఏర్పాట్లను సిద్ధం చేస్తోంది. ఇప్పటికే ఈవీఎం యంత్రాలు, ఎన్నికల సామగ్రిని ఆయా నియోజకవర్గ కేంద్రాల్లోని స్ట్రాంగ్ రూముల్లో భద్రం చేశారు. సమయం తక్కువగా ఉన్నందున ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని పార్టీల అభ్యర్థులు ప్రచారాన్ని వేగవంతం చేశారు. వీరితో పాటు బరిలో తాము కూడా ఉన్నామంటూ స్వతంత్రులు తమ స్థాయిలో ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. కర్నూలు లోక్‌సభ స్థానానికి 19 మంది బరిలో నిలిచారు. ఏడు అసెంబ్లీ స్థానాలకు 88 మంది పోటీలో మిగిలారు. అత్యధికంగా కర్నూలు అసెంబ్లీ నుంచి 25 మంది పోటీలో ఉండగా అత్యల్పంగా మంత్రాలయం నుంచి కేవలం 8 మంది మాత్రమే బరిలో నిలిచారు. అదేవిధంగా ఆలూరు నుంచి 12 మంది, ఆదోనిలో 10, కోడుమూరు (ఎస్సీ) 14, పత్తికొండలో 9, ఎమ్మిగనూరులో 10 మంది చొప్పున మంది పోటీలో ఉన్నారు. ప్రధాన రాజకీయ పక్షాలైన టీడీపీ, బీజేపీ, వైసీపీ, కాంగ్రెస్, సీపీఐ వంటి నాలుగైదు పార్టీల అభ్యర్థులను మినహాయిస్తే మిగిలిన వారంతా గుర్తింపు లేని పార్టీల తరపున, ఇండిపెండెంట్లుగా పోటీ చేస్తున్న వారే.

మంత్రాలయం రాఘవేంద్రులు

మంత్రాలయం నియోజకవర్గంలో బరిలో ఉన్నది కేవలం 8 మంది మాత్రమే వీరిలో టీడీపీ అభ్యర్థి ఎన్. రాఘవేంద్రరెడ్డి పేరును పోలిన మరో ఇద్దరు కూడా బరిలో ఉన్నారు. జాతీయ జనసేన పార్టీ (జేజేపీ) నుంచి ఆర్. రాఘవేంద్ర రెడ్డి బరిలో ఉండగా, స్వతంత్ర అభ్యర్థిగా ఎం. రాఘవేంద్ర రెడ్డి పోటీలో ఉన్నారు.


- కర్నూలు, మే 3 (ఆంధ్రజ్యోతి):

కర్నూలు (ఎంపీ)

టీడీపీ	వైసీపీ	కాంగ్రెస్	ఇతరులు
బస్తిపాటి నాగరాజు	బీవై రామయ్య	రాంపుల్లయ్య యాదవ్	స్వతంత్రులు : 8 బీఎస్పీ: లక్ష్మీనారాయణ జైభారత్ నేషనల్ పార్టీ : శ్రీధర్ బీసీవై : శ్రీధర్ ఇతర పార్టీలు : 5
			మొత్తం : 19

కర్నూలు (అసెంబ్లీ)



టీడీపీ	వైసీపీ	కాంగ్రెస్	ఇతరులు
టీజీ భరత్	ఏఎండీ ఇంతియాజ్	షేక్ జిలానీ బాషా	స్వతంత్రులు : 15 బీఎస్పీ: అరుణ్‌కుమార్ అన్నా వైఎస్సార్ పార్టీ : అబ్దుల్ సత్తార్ ఇతర పార్టీలు : 5
			మొత్తం : 25

మంత్రాలయం

టీడీపీ	వైసీపీ	కాంగ్రెస్	ఇతరులు
ఎన్.రాఘవేంద్ర రెడ్డి	వై.బాలనాగి రెడ్డి	మురళీకృష్ణ రాజు	స్వతంత్రులు : 3 బీఎస్పీ : జి.శామ్యుల్ జేజేపీ: రాఘవేంద్ర రెడ్డి
			మొత్తం : 8

ఆలూరు

టీడీపీ	వైసీపీ	కాంగ్రెస్	ఇతరులు
వీరభద్రగౌడ్	బి. విరూపాక్షి	అరికట్ల నవీన్ కిశోర్	స్వతంత్రులు : 6 బీఎస్పీ : రామలింగ బీసీవై: మోహన్ ప్రసాద్ బీఎస్పీ: షేక్షావలి
			మొత్తం : 12

ఎమ్మిగనూరు

టీడీపీ	వైసీపీ	కాంగ్రెస్	ఇతరులు
బీవీ జయనాగేశ్వర రెడ్డి	బుట్టా రేణుక	కాశీంవలి	స్వతంత్రులు : 5 బీఎస్పీ : కప్పటి రాఘవేంద్ర జాతీయ జనసేన పార్టీ: నాగార్జున రెడ్డి
			మొత్తం : 10

కోడుమూరు (ఎస్సీ)

టీడీపీ	వైసీపీ	కాంగ్రెస్	ఇతరులు
బొగ్గుల దస్తగిరి	ఆదిమూలపు సతీష్	పరిగెల మురళీకృష్ణ	స్వతంత్రులు : 10 బీఎస్పీ: జయరాజు
			మొత్తం : 14

పత్తికొండ

టీడీపీ	వైసీపీ	సీపీఐ	ఇతరులు
కేఈ శ్యాంబాబు	కంగాటి శ్రీదేవి	రామచంద్రయ్య	స్వతంత్రులు : 3 బీఎస్పీ : రాజేష్ నాయకల్లు ఆల్ ఇండియా కిసాన్ జనతా పార్టీ : మంకె వెంకటేష్ నేషనల్ క్రాంతి పార్టీ : వాల్మీకి పెద్దయ్య
			మొత్తం : 9

ఆదోని

బీజేపీ	వైసీపీ	కాంగ్రెస్	ఇతరులు
డాక్టర్ పార్థసారథి	వై.సాయిప్రసాద్ రెడ్డి	రమేష్ యాదవ్	స్వతంత్రులు : 5 బీఎస్పీ: ఆసియాబాను జైభీమ్‌రావు భారత్ పార్టీ : కె.రంగన్న
			మొత్తం : 10


ఓట్ల వేటలో జగన్నాటకం..!

- వేసవిలో పింఛన్‌దారులపై కక్ష సాధింపు
- వెసులుబాటు ఉన్నా ఇళ్ల వద్ద పంపిణీ చేయని వైనం
- వైసీపీ కుట్రలకు వృద్ధుల అగచాటు
- టీడీపీపై నెపం నెట్టి లబ్ధి పొందాలనే దురాలోచన



ఆదోనిలో అతి కష్టం మీద కాళ్లకు చెప్పులు లేకుండా నడిరోడ్డుపై నడుచుకుంటూ బ్యాంకుకు వస్తున్న వృద్ధురాలు బోయ నరసమ్మ (80)





ఎవరిదీ పాపం..!

వేసవిలో ఎండలు మండిపోతున్నాయి. 45 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో జనం అల్లాడిపోతున్నారు. యువత సైతం ఇంటి నుంచి బయటకు రావడానికి జంకుతోంది. అత్యవసరమై బయటకు వస్తే తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. మండుటెండలో పండుటాకులపై ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తోంది. క్లిష్ట పరిస్థితుల్లో ప్రభుత్వం పండుటాకులకు ఇంటి వద్దే పింఛను ఇవ్వాలని డిమాండ్లు వ్యక్తమవుతున్నా ప్రభుత్వం నిర్లక్ష్యంగానే వ్యవహరిస్తూ వృద్ధులను ఇబ్బందులకు గురి చేస్తోంది. మొన్న పింఛన్ల కోసం సచివాలయాల చుట్టూ తిప్పి ఇబ్బందులకు గురి చేసింది. అది సరిపోలేదని ఈసారి ఏకంగా కిలోమీటర్ల దూరం వెళ్లి బ్యాంకుల నుంచి పింఛను తెచ్చుకునేలా చేసింది. గత నెల కంటే ఈసారి వారి కష్టాలు రెట్టింపు అయ్యాయి. సచివాలయాల ఉద్యోగుల ద్వారా లబ్ధిదారుల ఇంటింటికి వెళ్లి పింఛను ఇచ్చే వెసులుబాటు ఉన్నా ఏప్రిల్‌లో ప్రభుత్వం లబ్ధిదారులను కష్టపెట్టింది. సకాలంలో నగదు ఇవ్వక పోవడంతో పింఛనుదారులు ఇబ్బందులు పడ్డారు. ప్రభుత్వం రాజకీయంగా లబ్ధి పొందడానికి ఇలాంటి పన్నాగాలు చేస్తోంది.

కర్నూలు న్యూసిటీ/ ఆదోని అగ్రికల్చర్/ ఓర్వకల్లు / ఆదోని రూరల్ /ఆలూరు/చాగలమర్రి/పాములపాడు, మే 3:

పింఛన్ కోసం వెళ్లి సొమ్మసిల్లిన వృద్ధురాలు



వెల్దుర్తి ఎస్‌బీఐ బ్యాంకు వద్ద సొమ్మసిల్లి పడిపోయిన వృద్ధురాలు షేక్ మలాన్ బీ

వెల్దుర్తి, మే, 3 : పింఛన్‌దారుల కష్టాలు వర్ణనాతీతంగా మారాయి. గత నెల సచివాలయ ఉద్యోగులతో ప్రభుత్వం ఇంటి వద్దకే పింఛన్లను పంపిణీ చేసింది. అయితే మే నెల మాత్రం బ్యాంకుల వద్దకు వెళ్లి పింఛన్లు తీసుకోవాలని సచివాలయ ఉద్యోగులు చెప్పడంతో లబ్ధిదారుల కష్టాలు మొదలయ్యాయి. శుక్రవారం వెల్దుర్తి మండల కేంద్రంలో ఓ వృద్ధురాలు పింఛన్ కోసం మండుటెండలో వెళ్లి బ్యాంకులో సొమ్మసిల్లిపడిపోయింది. వెల్దుర్తిలోని 8వ వార్డులో నివాసం ఉంటున్న షేక్ మలాన్ బీ పింఛన్ తీసుకోవడానికి శుక్రవారం స్టేట్ బ్యాంకుకు వెళ్లింది. లావాదేవీలు లేని కారణంగా బ్యాంకు అకౌంటు మనుగడలో లేదని ఈ-కేవైసీ చేయించిన తర్వాతే నగదు తీసుకోవడానికి వీలవుతుందని బ్యాంకు సిబ్బంది తెలిపారు. రద్దీగా ఉన్న క్యూ లైన్‌లో గంటల కొద్ది నిలబడి ఉండటంతో సదరు వృద్ధురాలు నీరసించి సొమ్మసిల్లి కింద పడిపోయింది. ఆందోళన చెందిన బ్యాంకు సిబ్బంది వృద్ధురాలికి ఓ పక్కన కూర్చోబెట్టి మజ్జిగ తాపించారు. అనంతరం యుద్ధప్రాతిపదికన ఈకేవైసీ అప్‌లోడ్ చేయించి పింఛన్ సొమ్మును వృద్ధురాలికి అందజేశారు.

ఖాతాల్లో జమ కాని పింఛన్

లబ్ధిదారుల ఖాతాల్లో పింఛన్ సొమ్మును జమ చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం అలసత్వం వహిస్తోంది. జగన్ మోహన్ రెడ్డి చేస్తున్న పింఛన్ రాజకీయంలో ఇదంతా ఓ భాగమేనని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఇదిలా ఉండగా చాలామంది వృద్ధులు, దివ్యాంగులకు పింఛన్ సొమ్ము ఖాతాల్లో జమకాకపోడంతో బ్యాంకులకు వచ్చి నిరాశగా వెనుతిరిగిపోతున్నారు. మిగిలిన వారికి శనివారం ఖాతాలో జమ అవుతాయని సచివాలయ సిబ్బంది చెబుతున్నారు. ఒక్క కర్నూలు నగర పాలక సంస్థ పరిధిలోని 52 వార్డుల్లో 133 సచివాలయాలు ఉన్నాయి. ఇందులో 34,044 మంది లబ్ధిదారులు ఉన్నారు. వీరందరికి ప్రభుత్వం నుంచి ప్రతి నెల రూ.10.31 కోట్లు పంపిణీ చేస్తున్నారు. దీంతో వేలమందితో బ్యాంకులు కిక్కిరిసి కనిపిస్తున్నాయి.



ఆలూరులో మీసేవా కేంద్రం వద్ద వృద్ధుల పడిగాపులు



ఆదోనిలోని మినీ బ్యాంకు వద్ద పడిగాపులు కాస్తున్న వృద్ధులు



పాములపాడులో వేచి ఉన్న వృద్ధులు



ఆదోని స్టేట్ బ్యాంకులో వృద్ధులు ఇలా..

వృద్ధులకు బ్యాంకు కష్టాలు

చాలామంది వృద్ధుల బ్యాంకు ఖాతాలు యాక్టివేట్‌లో లేవు. కొందరికి బ్యాంకు ఖాతాలే లేవు. ఐదేళ్లుగా పింఛన్లు చేతికే అందిస్తుండటంతో బ్యాంకు ఖాతాతో వారికి పనిలేకుండా పోయింది. అంతేకాకుండా చాలామంది తమ ఖాతాల్లో మినిమం బ్యాలెన్స్ కూడా ఉంచడం లేదు. దీంతో ఒకవేళ పింఛన్ నగదు జమ చేస్తే అందులో బ్యాంకు సిబ్బంది కోత విధిస్తున్నారు. మరో వైపు గ్రామాల్లో ఉండే పండుటాకులు పట్టణాలు, మండల కేంద్రాల్లోని బ్యాంకుల వద్ద గంటలకొద్దీ బారులు తీరాల్సి వస్తోంది. చాలామంది నిరక్షరాస్యులే కావడంతో నగదు తీసుకోవడంలో వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికమందికి బ్యాంకు డెబిట్ కార్డులు లేవు. దీంతో వారు ఓచర్(కాగితాల)ను భర్తీచేసి పింఛన్ తీసుకోవాల్సిన పరిస్థితి. దీంతో లబ్ధిదారులు పింఛన్ సొమ్మును తీసుకోవాలంటే గంటల కొద్దీ సమయం పడుతోంది.



చాగలమర్రి ఎస్‌బీఐ వద్ద పింఛన్ కోసం నిరీక్షిస్తున్న పింఛన్‌దారులు

తిరిగి తిరిగి చచ్చిపోతున్నాం



గ్రామాల్లో పింఛన్లు అందజేయకుండా బ్యాంక్ ఖాతాల్లో వేశారు. ఎర్రటి ఎండలలో ప్రయాణం చేసి వేరే గ్రామానికి వెళ్లి పింఛను తీసుకోవాల్సి వస్తోంది. ఈ ఎండలకు తిరగలేక సచ్చిపోతున్నాం.

- రాములమ్మ, ఎర్రగూడూరు

అనారోగ్యంతో ఎలా వచ్చేది



అనారోగ్యంతో బాధపడుతూ ఈ ఎండలో పింఛన్ డబ్బులకోసం వేరే గ్రామంలోని బ్యాంక్‌కు వెళ్లి తెచ్చుకోవాలంటే ఇబ్బందిగా ఉంది. ప్రభుత్వం ఇంటివద్దకే పింఛన్ పంపిణీ చేయాలి. ఎందుకు ఇలా చేస్తున్నారో అర్థం కావడం లేదు.

-చిన్నంకులు, మిట్టకందాల గ్రామం

ఇబ్బంది పెట్టడం తగదు



పింఛన్‌దారులను ఇబ్బంది పెట్టడం తగదు. బ్యాంకుకు వెళ్తే మూడు రోజుల నుంచి తిప్పుకుంటున్నారు. బ్యాంకులకు వెళ్లాలంటే సమయం వృథా అవుతోంది. పైగా ఎండలు ఎక్కువగా ఉన్నాయి. గత నెల సచివాలయం వద్ద పింఛన్ ఇచ్చినట్లుగా ఈనెల కూడా పంపిణీ చేసి ఉంటే బాగుండేది.

- దస్తగిరి, చాగలమర్రి

పింఛన్ కోసం అవస్థలు



మాది చింతలచెరువు గ్రామం. పింఛన్ కోసం చాగలమర్రిలోని ఎస్‌బీఐ బ్యాంకు వద్దకు ఉదయం 10 గంటలకు వచ్చాను. ఈనెలలో వృద్ధులను ఎండలో తిప్పుతూ ఇబ్బందులకు గురి చేయడం అన్యాయం. మూడు రోజులు తిరిగినా పింఛన్ అందలేదు.

-వెంకట్రామిరెడ్డి, చింతలచెరువు

ఈవీఎంల కమిషనింగ్ ప్రక్రియ పూర్తి: ఆర్వో


రాజకీయ పార్టీల అభ్యర్థులతో మాట్లాడుతున్న ఆర్వో దాసు

నందికొట్కూరు, మే 3: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా రెండో దశ ఈవీఎంల కమిషనింగ్ ప్రక్రియను శుక్రవారం పట్టణంలోని శ్లోకా స్కూల్‌లో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూం వద్ద ఆర్వో దాసు నిర్వహించారు. రిటర్నింగ్ అధికారి పర్యవేక్షణలో కమిషనింగ్ కోసం నియమితులై శిక్షణ పొందిన సెక్టోరల్ అధికారులు, బృందాలు ప్రక్రియ నిర్వహిస్తుండగా, భారత్ ఎలక్ట్రానిక్ లిమిటెడ్ ఇంజినీర్లు కంట్రోల్ యూనిట్లలో అభ్యర్థుల వివరాలు లోడ్ చేయడంతో పాటు, వీవీ ప్యాట్‌లలో అభ్యర్థుల పేర్లతో పాటు వారి చిహ్నాలను లోడ్ చేశారు. ఉదయం 7 గంటలకు మొదలైన కమిషనింగ్ ప్రక్రియకు అభ్యర్థుల నుంచి అధీకృత పత్రం కలిగిన ఏజెంట్లు, గరిష్టంగా ముగ్గురి వరకు హాజరై పరిశీలించినట్లు ఆర్వో దాసు తెలిపారు.

పోచాకు గుణపాఠం చెప్పాలి: బైరెడ్డి


సుంకేసుల గ్రామంలో మాట్లాడుతున్న రాజశేఖరరెడ్డి

మిడుతూరు, మే 3: రైతులకు నకిలీ విత్తనాలు విక్రయించే వైసీపీ ఎంపీ అభ్యర్థి పోచా బ్రహ్మానంద రెడ్డికి ఓటుతో గుణపాఠం చెప్పాలని టీడీపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర రెడ్డి ప్రజలకు సూచించారు. ఎన్నికల ప్రచారంలో బాగంగా మండలంలోని అలగనూరు, సుంకేసుల, వీపనగండ్ల గ్రామాల్లో శుక్రవారం రోడ్డు షో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో కరువు మండలాలు ప్రకటించిన రైతులుకు నష్ట పరిహారం ఇవ్వకుండా రైతును మోసం చేశారని అన్నారు. ఒక పక్క వర్షాలు కురవక, మరొక పక్క నకిలీ విత్తానాల వల్ల వైసీపీ పాలనలో రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీని అధిక మెజార్టీతో గెలిపించాలని బైరెడ్డి రాజశేఖర రెడ్డి ఓటర్లను కోరారు. కార్యక్రమంలో సుధాకర్, శేషి రెడ్డి, రామచందకనడు, భూపాల్ రెడ్డి, గుండం స్వామి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిక

గోస్పాడు, మే 3: ఎస్.కూలూరు గ్రామానికి చెందిన పలువురు వైసీపీ నాయకులు శుక్రవారం టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ సమక్షంలో టీడీపీలో చేరారు. గ్రామానికి చెందిన ఆర్ భరత్‌కుమార్‌రెడ్డి, గోపవరం సుబ్బారెడ్డి, ఎద్దుల శశి, పుల్లయ్య, తదితరులు టీడీపీలో చేరారు. చంద్రబాబు విడుదల చేసిన సూపర్ సిక్స్ పథకాలతో ప్రజా సంక్షేమం సాధ్యమవుతుందని అన్నారు. మండల కన్వీనర్ కాటంరెడ్డి తులసీశ్వరరెడ్డి, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైద్య పరికరాలు విరాళం


వైద్య పరికరాలను అందజేస్తున్న దాత

శ్రీశైలం, మే 3: శ్రీశైలం దేవస్థానం భక్తుల సౌకర్యార్థం ప్రాణదాన ట్రస్టు కింద నిర్వహిస్తున్న వైద్యశాలకు శుక్రవారం వైద్యపరికరాలను విరాళంగా అందజేశారు. ఈ విరాళాన్ని హెచ్‌ఈఎస్ ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్, మేనేజింగ్ డైరెక్టర్ ఐవీఆర్ కృష్ణంరాజు ఆలయ కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజుకు అందజేశారు. వైద్య పరికరాలు వెంటిలేటర్-1, డిఫిబ్రిలేటర్-1, కార్డిక్ మానిటర్-2, బైపాస్ మిషన్-2, ఇన్ఫ్యూషన్ పంపులు-2 వాటిని అందజేశారు. వీటి విలువ రూ. 16 లక్షలకు పైగా ఉంటుందని దాత తెలిపారు. కార్యక్రమంలో సహాయ కార్యనిర్వహణాధికారి మోహన్, ప్రజా సంబంధాల అధికారి టి.శ్రీనివాసరావు, పర్యవేక్షకుడు అయ్యన్న, సహాయ పీఆర్వో శివారెడ్డి, వైద్యశాల వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా ఊయల సేవ

శ్రీశైలం, మే 3: శ్రీశైలం క్షేత్రంలో లోకకల్యాణార్థం శుక్రవారం స్వామి, అమ్మవార్లకు ఊయల సేవను వైభవంగా నిర్వహించారు. పూజా కార్యక్రమంలో ముందుగా మహా గణపతి పూజను చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్లను ఊయలలో ఆశీనులనుజేసి శాస్త్రోక్తంగా షోడశోపచార పూజలు జరిపారు. అమ్మవారికి అష్టోత్తరం, త్రిశతి, ఖడ్గమాల, సహస్ర నామపూజలు, స్వామివారికి సహస్ర నామార్చన పూజలు నిర్వహించి మంగళ హారతులు సమర్పించారు. గ్రామదేవత అంకాలమ్మకు దేవస్థానం విశేష పూజలు నిర్వహించింది.

టీడీపీతోనే పేదలకు న్యాయం: మాండ్ర

జూపాడుబంగ్లా, మే 3: టీడీపీని గెలిపిస్తేనే పేద, మధ్యతరగతి కుటుంబాలకు న్యాయం జరుగుతుందని ఆ పార్టీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి, నందికొట్కూరు టీడీపీ అభ్యర్థి గిత్తా జయసూర్య అన్నారు. మండలంలోని పారుమంచాల, పి.లింగాపురం గ్రామాల్లో శుక్రవారం శంఖారావం కార్యక్రమంలో భాగంగా టీడీపీ ఆధ్వర్యంలో రోడ్‌షో నిర్వహించారు. వారు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో దళితులకు అందించే సంక్షేమ నిధులన్నీ పక్కదారి పట్టించి అభివృద్ధి చేయకుండా మోసం చేసిందన్నారు. టీడీపీ నాయకులు వెంకటేశ్వర్లుయాదవ్, వెంకటరమణారెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, గిరీశ్వరరెడ్డి, రమణారెడ్డి, శ్రీనివాసులు, రవికాంత్, సంపత్‌కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

నందికొట్కూరు రూరల్: టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి అన్నారు. నందికొట్కూరు మండలంలోని అల్లూరు గ్రామంలో శుక్రవారం మాండ్ర, జయసూర్యల సమక్షంలో నాగటూరు గ్రామ టీడీపీ నాయకులు మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో నాగటూరు గ్రామ వైసీపీ నాయకులు టీడీపీలో చేరారు. వీరికి మాండ్ర శివానందరెడ్డి టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు పార్టీలోకి చేరినవారు హరిబాబు, తిరుపతి, మద్దిలేటి, నారాయణ, రాము, కిషోర్ తదితరులు ఉన్నారు. టీడీపీలో చేరినవారు మాండ్ర శివానందరెడ్డి, జయసూర్యను పూల మాలలతో దుశ్శాలువాతో సన్మానించారు. అనంతరం మాండ్ర శివానందరెడ్డి మాట్లాడుతూ వైసీపీ పాలనలో రాష్ట్రాభివృద్ధి 20 సంవత్సరాలు వెనక్కి వెళ్లిందన్నారు. మళ్లీ రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే టీడీపీ అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. చంద్రబాబు ఒక విజన్ ఉన్న నాయకుడు అని అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఉన్నప్పుడు రాష్ట్రంలో ఐటీ రంగాన్ని అభివృద్ధి చేసి ఉద్యోగావకాశాలు కల్పించారన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ ఓబుల్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● నందికొట్కూరు మండలంలోని మల్యాల, శాతనకోట గ్రామాల్లో టీడీపీ అభ్యర్థి గిత్తా జయసూర్య రోడ్ షో నిర్వహించారు. కార్యక్రమంలో మాండ్ర లింగా రెడ్డి, సురేంద్రనాథరెడ్డి, బాలమద్దయ్య మద్దిలేటి, అంజిబాబునాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.


ఇస్కాల గ్రామంలో ప్రచారం చేస్తున్న మాండ్ర శివానందరెడ్డి

నందికొట్కూరు: టీడీపీ అధికారంలోకి వస్తే మూడు సిలెండర్లు అందజేస్తుందని టీడీపీ నాయకుడు మాండ్ర లింగా రెడ్డి అన్నారు. శుక్రవారం సాయంత్రం నందికొట్కూరు పట్టణంలోని 14వ వార్డులో సూపర్ సిక్స్ పథకాలపై ఇంటింటి ప్రచారం చేశారు. ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్ పథకాలలో మహిళలకు అధిక ప్రాధాన్యత ఇచ్చారని ఆయన అన్నారు. కార్యక్రమంలో మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి, మోహన్, కృష్ణా రెడ్డి, వేణుగోపాల్, మల్లికార్జున రెడ్డి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.


నందికొట్కూరులోని 14వ వార్డులో ప్రచారం చేస్తున్న లింగారెడ్డి

పాములపాడు: మండలంలోని ఇస్కాల గ్రామంలో తెలుగుదేశం ప్రభుత్వంలో ఎత్తిపోతల పథకం నిర్మించి రైతాంగానికి రెండువేల ఎకరాలకు సాగునీరందించిన ఘనత ఒక్క టీడీపీకే దక్కిందని నంద్యాల టీడీపీ పార్లమెంట్ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని ఇస్కాల, చెలిమిళ్ళ, లింగాల గ్రామాలలో ఎన్నికల ప్రచారం చేశారు. వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే అభ్యర్థి జయసూర్య, ఎంపీ అభ్యర్థి బైరెడ్డి శబరికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తిమ్మారెడ్డి, రవీంద్రరెడ్డి గోవింద్, మధుకృష్ణ, కృష్ణ, సురేశ్, నాగలక్ష్మిరెడ్డి, లింగస్వామి, ఈశ్వరరెడ్డి, కలీముల్లా, బీజేపీ, జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.


పారుమంచాల గ్రామంలో మాట్లాడుతున్న మాండ్ర


అల్లూరులో మాండ్ర సమక్షంలో టీడీపీలో చేరిన నాగటూరు వైసీపీ నాయకులు

రైతుల భూములపై జగన్ కన్ను: గౌరు చరిత


పాణ్యంలో హాజరైన నాయకులు, కార్యకర్తలు

పాణ్యం, మే 3: రైతులకు అన్యాయం జరిగితే కోర్టుకు వెళ్లలేని దుస్థితి వైసీపీ ప్రభుత్వం తెచ్చిందని, రైతుల భూములపై జగన్ కన్ను పడిందని పాణ్యం టీడీపీ అభ్యర్థి గౌరు చరిత అన్నారు. మండలంలోని తొగర్చేడు, సుగాలిమెట్ట, గోరుకల్లు తండా, పాణ్యం గ్రామాలలో శుక్రవారం ఆమె ఎన్నికల ప్రచారం చేశారు. గౌరు చరిత మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లపాలనలో రైతులకు తీవ్రంగా అన్యాయం చేసిందన్నారు. కొత్త జీవోలతో రైతులు ఎంతో నష్టపోయారన్నారు. వ్యవసాయ భూముల్లో అన్యాయం జరిగితే కోర్టుకు వెళ్లకుండా జీవోలు తెచ్చిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. రైతుల భూములను కాజేసేందుకే ఈ జీవోలు తెచ్చారని మండిపడ్డారు. టీడీపీ అధికారంలోకి రాగానే ఈ జీవోలను రద్దు చేసి ప్రజారంజక పాలన అందిస్తామని అన్నారు. ఇసుక, కొండలు, వాగులు, ప్రభుత్వ భూములను అక్రమార్కులకు అప్పనంగా అప్పజెప్పారన్నారు. ఆరుసార్లు గెలిచిన నాయకులు ఏమి అభివృద్ధి సాధించారో పాణ్యం ప్రజలకు తెలుసు అని అన్నారు. పంట కాలులు, పంట రస్తాల అభివృద్ధికి పాటుపడిందేమీ లేదన్నారు. ఎంత సేపున్నా తన స్వలాభం, తన అనుచరుల దౌర్జన్యాలు చూస్తూ మౌనంగా ఉండడం తప్ప నియోజకవర్గ అభివృద్ధికి ఏమీ చేయలేదన్నారు. పంట కాలువలు శిథిలమైనా పట్టించుకునే నాథుడే లేరన్నారు. తొగర్చేడు ప్రజలు సచివాలయం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. సుగాలిమెట్ట వద్ద సర్వీసు రోడ్డు లేక ప్రజలు, ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. గోరుకల్లు తండాలో సరైన వసతులు లేవన్నారు. పాణ్యంలో ప్రయాణికులకు కనీసం తాగునీరు, మరుగుదొడ్డి సౌకర్యాలు లేవని అన్నారు. జగన్ పాలనలో అభివృద్ధి 20 ఏళ్లు వెనక్కి వెళ్లిందని అన్నారు. ఉద్యోగుల పరిస్థితి దారుణంగా తయారైందని, సమయానికి జీతాలు అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రహరీ నిర్మాణానికి నిధులు లేక నిలిచిపోయిందన్నారు. జగన్‌కు ఓటు వేసి మరోసారి పొరపాటు చేయవద్దని సూచించారు. వైసీపీ నాయకుల కన్ను పడితే కబ్జాలేనని అన్నారు. జగన్నాథగట్టు వద్ద జరిగిన ఆక్రమణలో అధికారులు రూ.19 కోట్లకు నోటీసులు ఇచ్చారన్నారు. వైసీపీ పాలనలో తొమ్మిది సార్లు విద్యుత్ చార్జీలు పెంచారన్నారు. పేద ప్రజల పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. చంద్రబాబు ప్రవేశపెట్టిన సూపర్‌సిక్స్ పథకాలు పేద, బడుగు వర్గాల అభివృద్ధికోసమే తయారైందన్నారు. మహాశక్తి కార్యక్రమంలో భాగంగా మహిళలకు సూపర్ సిక్స్ పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. తల్లికి వందనంలో భాగంగా ఇంట్లో చదివే పిల్లలందరికీ ఏటా రూ. 15వేలు అందిస్తుందన్నారు. ఆడబిడ్డ నిధి నుంచి 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1500, దీపం పథకం కింద ప్రతి కుటుంబానికి ఏటా మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందజేయనున్నట్లు తెలిపారు. మహిళలకు ఉచితంగా ఆర్టీసీ బస్సు ప్రయాణం, ఐదేళ్లలో 20 లక్షల మంది యువతకు ఉపాధి, నిరుద్యోగ యువకులకు ప్రతి నెలా యువగళం నుంచి రూ. 3 వేలు జీవన భృతి కింద అందించనున్నట్లు తెలిపారు. రైతులకు ఏటా రూ.20 వేలు ఆర్థిక సాయం అందిస్తామన్నారు. వైసీపీ అరాచకాలను ఎదుర్కొనేందుకు బీసీలకు రక్షణ చట్టం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రతి ఇంటికి కొళాయి కనెక్షన్ కల్పిస్తామన్నారు. పేదలను సంపన్నులను చేసే కార్యక్రమం చేపట్టామన్నారు. పాణ్యంలో జిల్లా కార్యదర్శి రమణమూర్తి ఆధ్వర్యంలో 37 కుటుంబాలు టీడీపీలో చేరారు. జనసేన నాయకులు జగదీశ్‌బాబు, జయరామిరెడ్డి, చంద్రశేఖరరెడ్డి, రమణారెడ్డి, రమణ మూర్తి, ఎంపీటీసీ రంగరమేష్, ఖాదర్‌బాషా, రామ్మోహన్‌నాయుడు, చంద్రానాయక్, టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.


పాణ్యంలోని చెంచుకాలనీలో ప్రచారంలో పాల్గొన్న గౌరు చరిత


తొగర్చేడులో మాట్లాడుతున్న గౌరు చరిత


తొగర్చేడులో ప్రచారం చేస్తున్న గౌరు చరిత

రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన వైసీపీ: బుడ్డా


గోపవరంలో బుడ్డా రాజశేఖరరెడ్డికి హారతి పడుతున్న మహిళలు

మహానంది, మే 3: ఒక్క చాన్సుపేరుతో రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన వైసీపీని ఇంటికి సాగనంపుదామని టీడీపీ శ్రీశైలం అభ్యర్థి బుడ్డా రాజశేఖర రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం రెండోరోజు మహానంది మండలంలోని మసీదుపురం, సీతారామపురం, గాజులపల్లె ఆర్ఎస్, గోపవరం, గాజులపల్లె గ్రామాల్లో మాజీ ఎమ్మెల్యే బుడ్డా రోడ్ షోను నిర్వహించారు. ఆయా గ్రామాల ప్రజలు హారతులు పట్టి అపూర్వ స్వాగతం పలికారు. ఆయా గ్రామాల రోడ్ షోలో బుడ్డా ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ఇతర జిల్లాల నుంచి వలస వచ్చిన ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి గ్రామాల్లో చిచ్చుపెట్టి పైశాచిక ఆనందం పొందుతున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో సైకిల్‌గుర్తుకు ఓటువేసి వలస నాయకులను తరిమి కొట్టి, ఇవే చివరి ఎన్నికలు అన్న గుణపాఠాన్ని ప్రజలు ఓటు అనే ఆయుధంతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. టీడీపీ అధికారంలోకి వస్తే రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందుతుందన్నారు. సమయం లేకపోవడంతో ఇంటింటికి తిరగలేకపోతున్నాని, ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని సూచించారు. మండలంలో వైసీపీ నాయకుల అరాచకాలకు అంతు లేకుండా పోయిందన్నారు. గ్రామల్లో తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నాన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బుడ్డారెడ్డి యశస్విని, శ్రీశైల నియోజకవర్గం టీడీపీ సమన్వయ కర్త రామలింగారెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు మధు, గాజులపల్లె ఆర్ఎస్ సర్పంచ్ అస్లాంబాషా, క్రాంతి కుమార్ యాదవ్, మాజీ ఎంపీపీలు నాగభూపాల్‌రెడ్డి, నాగమణి, టీడీపీ నాయకులు, బుడ్డారెడ్డి శ్రీనివాసరెడ్డి, నరాల మౌళీశ్వరరెడ్డి, మహేశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వెలుగోడు: టీడీపీతోనే మహిళల సాధికారత సాధ్యమని బుడ్డా శైలజ అన్నారు. శుక్రవారం ఆమె బుడ్డా స్వగ్రామమైన వేల్పనూరులో ఇంటింటా ప్రచారం చేఆరు. మేనిఫెస్టో గురించి ప్రజలకు వివరించారు. ఈ పథకాలు దరి చేరాలంటే టీడీపీ అభ్యర్థి బుడ్డా రాజశేఖరరెడ్డి, ఎంపీ అభ్యర్థి బైరెడ్డి శబరిని గెలిపించాలని కోరారు. బుడ్డా శైలజ ఓ వృద్ధురాలిని ఆప్యాయంగా పలకరించారు. గ్రామంలోని ప్రతి కుటుంబాన్ని తమ కుటుంబంగా భావిస్తామని, ప్రతి ఒక్కరూతమకు ఎంతో చనువుగా ఉంటారని చేతిలో చెయ్యేసి అడుగుతున్నా అవ్వా ఈ బంధాన్ని ఇలాగే కొనసాగించాలని కోరారు. తప్పకుండా బుడ్డా రాజశేఖర్‌రెడ్డికే ఓటు వేస్తానని వృద్ధురాలు బదులిచ్చారు. వెలుగోడు పట్టణంలో బుడ్డా శైలజ సోదరి రమాదేవి ఎన్నికల ప్రచారం చేశారు. మాజీ సర్పంచ్ కలాం ఆధ్వర్యంలో సీపీ నగర్, ద్వారకా నగర్, లక్ష్మీనగర్‌లో ఎన్నికల ప్రచారం చేశారు. కార్యక్రమంలో ఖలీల్, మండ్ల శంకర్‌రెడ్డి, సురేష్, మధు, యతీష్, రాము, జనార్దన్, తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలం: టీడీపీ శ్రీశైలం అభ్యర్థి బుడ్డా రాజశేఖరరెడ్డి కుమార్తె మేఘనారెడ్డి శుక్రవారం సుండిపెంటలో ఇంటింటికి తిరిగి ప్రచారం చేశారు. శ్రీశైలం మండలం అభివృద్ధి కావాలంటే బుడ్డా రాజశేఖరరెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. మేనిఫెస్టో గురించి ప్రజలకు వివరించారు. ఆమె మాట్లాడుతూ వైసీపీ అధికారం చేపట్టిన నాటి నుంచి అభివృద్ధి మాట పక్కన పెడితే ప్రజలను దోచుకున్నారని, అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రజలు అర్థంచేసుకుని తమ ఓటుతో వైసీపీకి బుద్ధి చెప్పాలని అన్నారు.


వేల్పనూరులో ప్రచారం చేస్తున్న బుడ్డా శైలజ


సుండిపెంటలో మేఘన రెడ్డికి స్వాగతం పలుకుతున్న నాయకులు


వెలుగోడులో ప్రచారం చేస్తున్న బుడ్డా శైలజ సోదరి రమాదేవి

విద్యార్థులకు అభినందన

నంద్యాల (కల్చరల్), మే 3: పట్టణంలోని ఆర్యవైశ్య సామాజిక వర్గానికి చెందిన పది, ఇంటర్‌లో అత్యంత ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సన్మానం, అభినందన కార్యక్రమం నిర్వహించారు. నంద్యాల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు భవనాశి శ్రీనివాస ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని గీతా భవన్‌లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. పదో తరగతిలో 550 మార్కులు పైన, ఇంటర్‌లో 920 మార్కులు పైనా ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు సంఘం మెమెంటో ఇచ్చి, శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. భవనాశి శ్రీనివాస మాట్లాడుతూ ఆర్యవైశ్య విద్యార్థుల అభ్యున్నతికి సంఘం ఎళ్లవేళలా కృషి చేస్తుందన్నారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.


మెమెంటో, ప్రశంసా పత్రం అందజేస్తున్న ఆర్యవైశ్య సంఘం సభ్యులు

గుండెపోటుతో ఉపాధి కూలీ మృతి

కొత్తపల్లి, మే 3: కొత్తపల్లి మండలం సింగరాజుపల్లిలో పుట్టిపోగు వెంకటేశ్వర్లు (75) అనే ఉపాధి కూలీ గుండెపోటుతో మృతి చెందినట్లు ఏపీవో రేష్మా తెలిపారు. ఆమె తెలిపిన వివరాలివీ.. వెంకటేశ్వర్లు శుక్రవారం ఉదయం సింగరాజుపల్లె గ్రామ శివారులోని చెరువులో పూడికతీత పనులు చేస్తుండగా.. ఉన్న ఫలంగా ఉపాధి కూలీ చాతిలో నొప్పి రావడంతో తీవ్ర అస్వస్థతకు గురైనట్లు చెప్పారు. సహచర ఉపాధి కూలీలు, కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆత్మకూరులోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా.. అక్కడ వైద్య చికిత్స పొందుతూమృతి చెందినట్లు వైద్యులు పేర్కొన్నారు. వెంకటేశ్వర్లుకు భార్య రమణమ్మతో పాటు ఒక కమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుని కుటుంబానికి ప్రభుత్వం నుంచి రావాల్సిన సాయాన్ని త్వరలో అందజేస్తామని ఏపీవో వెల్లడించారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

వైసీపీ ఓటమి ఖాయం : కేఈ



కొండపేటలో ప్రచారం చేస్తున్న మాజీ మంత్రి కేఈ ప్రభాకర్

డోన్, మే 3: సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీకి ఓటమి ఖాయమని మాజీ మంత్రి కేఈ ప్రభాకర్ అన్నారు. శుక్రవారం డోన్ పట్టణంలోని కొండపేటలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కోట్ల నివేదిత, తనయుడు రుద్రఫణి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ టీఈ కేశన్నగౌడుతో కలిసి కేఈ ప్రభాకర్ ఇంటింటికి తిరిగి టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కేఈ ప్రభాకర్ మాట్లాడుతూ సీఎం జగన్ విధ్వంస పాలనతో రాష్ట్రాభివృద్ధి మరో 30 ఏళ్ల వెనక్కు వెళ్లిందన్నారు. సీఎం జగన్, ఆర్థిక మంత్రి బుగ్గన ఇద్దరు కలిసి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను సర్వనాశనం చేశారని మండిపడ్డారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కిరణ్ యాదవ్, అలేబాదు శ్రీకాంత్, చాంద్ బాషా, రాముగౌడ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అల్లాబకాష్ వలి ఉరుసు



ఇసుక సంచి బస్తాను ఎత్తుతున్న చంద్ర

బేతంచెర్ల, మే 3: పట్టణ శివారులోని బలపాలపల్లి రస్తాలో వెలసిన సయ్యద్ అల్లాబకాష్ వలి ఉరుసు ఉత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. రాత్రి పట్టణంలోని కాల్వ ప్రభాకర్ ఇంటి నుంచి మేళతాళాల మధ్య గంధంను దర్గాకు చేరారు. ఈ సందర్భంగా స్వామివారికి భక్తులు ఫతేహాలు సమర్పించారు. సాయంత్రం దర్గా కమిటీ ఆధ్వర్యంలో గుండు, చందా ఇసుకబస్తాను ఎత్తు పందెం పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో గోసానిపల్లి చెందిన చంద్ర మొదటి విజేతగా నిలవగా.. పుల్లగుమ్మి సుదాకర్ 5 తులాల వెండి పతకాన్ని ప్రదానం చేశారు.

టీడీపీలో చేరిక

బనగానపల్లె, మే 3: మండలంలోని తమ్మడపల్లె, జంబులదిన్నె గ్రామాలకు చెందిన పలువురు వైసీపీ నాయకులు బనగానపల్లె పట్టణంలోని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాటసాని చంద్రశేఖర్‌రెడ్డి సమక్షంలో శుక్రవారం టీడీపీలో చేరారు. వైసీపీకి చెందిన నాగమద్దిలేటి, శ్రీకాంత్, మహేంద్ర, చంద్ర, శేషు, సుధాకర్, గుండ్రమద్దిలేటి, గోపాల్, రామకృష్ణ, సూరి, మధు, కుమార్, మనోహర్‌రెడ్డి, రామకృష్ణలు టీడీపీలో చేరారు.

రుద్రవరం: మండలంలోని ఆలమూరు గ్రామానికి చెందిన మాబువుసేన్ తన అనుచర వర్గంతో శుక్రవారం టీడీపీ నాయకుడు భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆళ్లగడ్డలోని భూమా స్వగృహంలో టీడీపీలో చేరారు. నారాయణ, ప్రసాద్ తదితరులు ఉన్నారు.

19 మందిపై బైండోవర్ కేసులు

సంజామల, మే 3: సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని వైసీపీ, టీడీపీలకు చెందిన 19మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐరమేశ్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. పేరుసోముల గ్రామానికి చెందిన వైసీపీ నుంచి ఐదుగురిని, టీడీపీ నుంచి ఐదుగురిని, రామిరెడ్డిపల్లెకు చెందిన వైసీపీ నుంచి ఇద్దరిని, టీడీపీ నుంచి ఇద్దరిని, ఆల్లకొండలో వైసీపీ నుంచి ఐదుగురిని బైండోవర్ చేసి తహసీల్దారు ఎదుట హాజరుపరచి సొంత పూచీకత్తుపై విడుదల చేసినట్లు ఆయన తెలిపారు.

మట్కా బీటర్ అరెస్టు

కోవెలకుంట్ల, మే 3: కోవెలకుంట్ల పట్టణానికి చెందిన మట్కా బీటర్ సుబ్బరాయుడును అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి రూ.3950 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వరప్రసాద్ తెలిపారు. శుక్రవారం ఆయన తెలిపిన వివరాల మేరకు.. కోవెలకుంట్ల పట్టణంలో కొందరు వ్యక్తులు మట్కా నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో తన సిబ్బందితో కలిసి ఎల్ఎమ్ కాంపౌండ్‌లో దాడిచేయగా సుబ్బరాయుడు మట్కా నిర్వహిస్తుండగా అతనిని అదుపులోకి తీసుకొని రూ 3950 స్వాధీనం చేసుకొని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

బైకులు ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు

రుద్రవరం, మే 3: రుద్రవరం గ్రామంలో శుక్రవారం రెండు బైకులు ఢీకొన్న ఘటనలో చాగలమర్రి గ్రామానికి చెందిన నరసింహ అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు చికిత్స నిమిత్తం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడనుంచి మెరుగైన వైద్యం కోసం ఆళ్లగడ్డకు తరలించారు.

'వృద్ధులు జాగ్రత్తలు తీసుకోవాలి'

ఉయ్యాలవాడ, మే 3: అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో దీర్ఘకాలిక వ్యాధులు గల వారు, వృద్ధులు ఉపాధి పనులకు హాజరు కాకపోవడమే మంచిదని, జాగ్రత్తలు తీసుకోవాలని ఏపీవో రవిప్రకాష్ సూచించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో రఘురామ్ ఆధ్వర్యంలో ఎంపీపీ బుడ్డా భాగ్యమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. పింఛన్ డబ్బులు ఏ బ్యాంకు ఖాతాలో జమ చేశారో వాటి సమగ్ర సమాచారం లబ్ధిదారులకు ఇవ్వాలని నర్సిపల్లె గ్రామ సర్పంచ్ గురుప్రసాద్ అధికారులను కోరారు.

వెలగటూరు లిఫ్ట్ ఏమైంది?

- వంచించిన ఎమ్మెల్యే కాటసాని
- బనగానపల్లె టీడీపీ అభ్యర్థి బీసీ జనార్దన్‌రెడ్డి

కోవెలకుంట్ల, మే 3: వెలగటూరుకు లిఫ్ట్ ఇరిగేషన్ కట్టిస్తామని వాగ్దానం చేసి ఈ ప్రాంత ప్రజలను ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మోసం చేశారని బనగానపల్లె టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బీసీ జనార్దన్‌రెడ్డి విమర్శించారు. శుక్రవారం వెలగటూరు, పెద్దకొప్పెర్ల, చిన్నకొప్పెర్ల, వల్లంపాడు గ్రామాల్లో ప్రజాగళం కార్యక్రమంలో బీసీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీసీ మాట్లాడుతూ నిబంధనల పేరుతో సంక్షేమ పథకాలకు వైసీపీ ప్రభుత్వం తూట్లు పొడిచిందన్నారు. ఐదేళ్లుగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు, సామాన్య ప్రజలపై అక్రమ కేసులు పెట్టి రెచ్చగొట్టడమే తమ కర్తవ్యంగా వైసీపీ నాయకులు ప్రవర్తించారని మండిపడ్డారు. మద్య నిషేధం చేస్తామని సీఎం జగన్ మాట ఇచ్చి మద్యం గ్రామాల్లో, పట్టణాల్లో ఏరులై ప్రవహించేలా చేసి చివరకు మద్యం అమ్మకాలపై రుణం తెచ్చిన ఘనుడన్నారు. అలాగే నాసిరకం మద్యం అమ్మి ప్రజల ఆరోగ్యాలను గుల్ల చేశారన్నారు. నకిలీ మద్యంతో వేలాది మంది మృత్యువాత పడ్డారన్నారు. టీడీపీ హయంలో వెలగటూరులో 5 చెక్‌డ్యాంలు నిర్మించి భూగర్భ నీటిని పెంచిన ఘనత టీడీపీదే అన్నారు. పెద్దకొప్పెర్ల ఎత్తిపోతల పథకం నిర్మిస్తామని, పొలాలకు వెళ్లే రస్తా లకు గ్రావెల్ రోడ్డు వేయిస్తామని బీసీ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీసీ సోదరుడు బీసీ రామనాథరెడ్డి, అమడాల మద్దిలేటి, వెలగటూరు ధనుంజ యుడు, తిమ్మరాజు, గజ్జల హుసేనయ్య, పెద్దకొప్పెర్ల వెంకటేశ్వరరెడ్డి, శంకర్ రెడ్డి, చిన్నకొప్పెర్ల, బుచ్చెన్న, వెంకటసుబ్బారెడ్డి, వల్లంపాడు సర్పంచ్ జగదీశ్వరరెడ్డి, నారాయణరెడ్డి, టీడీపీ, జనసేన నాయకలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీసీ సమక్షంలో టీడీపీలో చేరిక

బనగానపల్లె: సంజామల మండలం రామిరెడ్డిపల్లెకు చెందిన వైసీపీ నేతలు శుక్రవారం బనగానపల్లె టీడీపీ అభ్యర్థి బీసీ జనార్దన్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో టీడీపీ నాయకులు మంచాల వీరప్రతాప్‌రెడ్డి నేతృత్వంలో చెండ్రాయుడు, రెడ్డెం రామిరెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, మహేశ్వరరెడ్డి, పుల్లయ్య, కిట్టు, సుబ్బరాయుడు, ప్రసాద్, గురప్ప, శివన్న, శివ, వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, రాముడు, విజయ్ ఓబన్న, ఓబులేసు టీడీపీలో చేరారు. అలాగే మంగం పేటకు చెందిన సీనియర్ వైసీపీ నాయకుడు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో బీసీ సమక్షంలో టీడీపీలో చేరారు. బనగానపల్లె మండలం వెంకటాపురానికి చెందిన వార్డు సభ్యురాలు సుబ్బలక్ష్మమ్మతోపాటు పలువురు శుక్రవారం వైసీపీని వీడి బనగానపల్లె టీడీపీ కార్యాలయంలో బీసీ ఇందిరమ్మ సమక్షంలో టీడీపీలో చేరారు.

టీడీపీని గెలిపించండి: బీసీ ఇందిరమ్మ

కొలిమిగుండ్ల రూరల్: సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని పార్టీ నాయకులు బీసీ ఇందిరమ్మ కోరారు. శుక్రవారం కొలిమిగుండ్ల మండలంలోని బెలుం, బెలుం శింగ వరం, మీర్జాపురం గ్రామాల్లో టీడీపీ అభ్యర్థి బీసీజేఆర్ సతీమణి బీసీ ఇందిరమ్మ పర్యటించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మీర్జాపురం- పేరుసోముల కనెక్టింగ్ రోడ్, ఇంటింటికీ కొళాయి, సీసీ రోడ్లు, రజకులకు దోబీ ఘాట్లు తదితర పనులు చేపట్టకుండా నాపరాళ్ల పరిశ్రమను సర్వనాశనం చేసి, అభివృద్ధిని గాలికి వది లేసిన నాయకులకు మళ్లీ తిరిగి ఓట్లు వేయాలా అంటూ ప్రశ్నించారు. ఈ గ్రామాలకు ప్రధాన జీవనాధారమైన నాపరాళ్ల పరిశమకు సంబంధించి రాయల్టీ చెక్‌పోస్టు ఎత్తివేస్తామని హామీ ఇచ్చిన నాయకులు, హామీ నెరవేర్చకుండా ఓట్లు ఏ ముఖం పెట్టుకొని అడుగుతారంటూ వైసీపీ నేతలను ఆమె ప్రశ్నించారు. మీర్జాపురం నుంచి కొలిమిగుండ్లకు రోడ్డు అధ్వానంగా వుండగా బీటీ రోడ్డు తామే వేశామన్నారు. కార్యక్రమంలో నాయకులు అయా గ్రామాల నాయకులు టపాల్ హుశేని, పోతిరెడ్డి రాఘవరెడ్డి, మీర్జాపురం పోరెడ్డి చిన్నపురెడ్డి, మండల నాయకులు పాల్గొన్నారు.



మహిళలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి

టీడీపీలోకి వలస: కొలిమిగుండ్ల మండలంలోని కమ్మవారిపల్లె, లక్షుంపల్లె గ్రామాలకు చెందిన పలువురు వైసీపీ నాయకులు శుక్రవారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. కమ్మవారిపల్లె మాజీ సర్పంచ్ వెంకటేశ్వరావు, కత్తి రాందాస్ ఆధ్వర్యంలో వైసీపీకి చెందిన ధర్మారాయుడు, రామ్మోహన్ తదితరులు మాజీ ఎమ్మెల్యే బీసీ సమక్షంలో టీడీపీలో చేరారు. మండలంలోని ఉమ్మాయిపల్లె తండాలో సైతం పలువురు వైసీపీ కార్యకర్తలు టీడీపీకి మద్దతు పలికారు. బీసీ జనార్దన్‌రెడ్డి కోడలు బీసీ క్షీరారెడ్డి సమక్షంలో గ్రామానికి చెందిన పలువురు టీడీపీలో చేరారు.

వైసీపీని ఇంటికి సాగనంపడానికి ప్రజలు సిద్ధం: బీసీ క్షీరారెడ్డి

అవుకు: వైసీపీని ఇంటికి సాగనంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని బనగానపల్లె అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి బీసీ జనార్దన్ రెడ్డి కోడలు బీసీ క్షీరారెడ్డి, కూతురు మనోరమా రెడ్డి అన్నారు. శుక్రవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా అవుకు పట్టణానికి చేరుకున్న బీసీ. క్షీరారెడ్డి, మనోరమ, బీసీ మౌర్యనాథ్ రెడ్డితో పాటు టీడీపీ నాయకులు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి చల్లా విజయ భాస్కర్ రెడ్డి, ఉగ్రసేనా రెడ్డి, మోట్ల రామిరెడ్డి, కాశీపురం సర్పంచ్ మోట్ల లావణ్య, చల్లా రాజ్యలక్ష్మి, బత్తిన మద్దిలేటి గౌడ్, కార్యకర్తలు ఇంటింటికి తిరిగి సూపర్‌సిక్స్ కరపత్రాలు అందించి విస్తృత ప్రచారం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వెంకటరమణనాయక్, దంతెల రమణ, తిక్కన్న, మిద్దె ప్రసాద్, రామాంజి, అక్కప్ప, శ్రీను, శేగు కిట్టు, వెంకటలక్ష్మమ్మ, అధిక సంఖ్యలో టీడీపీ, జనసేన పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



టీడీపీలో చేరిన వారితో మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి



రోడ్‌షోలో మాట్లాడుతున్న బీసీ ఇందిరమ్మ



టీడీపీ నాయకులతో బీసీ క్షీరారెడ్డి

బుగ్గన రూ.20 వేల కోట్లు కాజేశాడు

- ఆర్థిక మంత్రి పదవిని అడ్డం పెట్టుకుని అక్రమ సంపాదన
- డోన్ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి ఆరోపణ

డోన్, మే 3: ఆర్థిక మంత్రి పదవిని అడ్డం పెట్టుకుని బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి రూ.20 వేల కోట్లు కొట్టేశాడని కేంద్ర మాజీ మంత్రి, డోన్ టీడీపీ కూటమి అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. శుక్రవారం డోన్ మండలంలోని ఎద్దుపెంట, తాడూరు, అనుంపల్లి గ్రామాల్లో కోట్ల ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ సీఎం పదవిని అడ్డం పెట్టుకుని జగన్ రూ.లక్ష కోట్లు అక్రమంగా కాజేస్తే, ఆర్థిక మంత్రి బుగ్గన అక్రమంగా రూ. 20వేల కోట్లు సంపాదించారని విమర్శించారు. రాష్ట్రానికి రూ. లక్షల కోట్లు అప్పులు చేసి వాటికి లెక్కలు చెప్పకుండా సీఎం, ఆర్థిక మంత్రి ఇద్దరు దొంగలు కలిసి అవినీతికి పాల్పడ్డారని మండిపడ్డారు. అక్రమంగా సంపాదించిన డబ్బుతో డోన్ నియోజకవర్గంలో మళ్లీ గెలవాలని బుగ్గన కుట్రలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామక్రిష్ణ, మాజీ ఎంపీపీ శేషఫణిగౌడు, మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసులు యాదవ్, భాస్కర్ నాయుడు, రేగటి అర్జున్ రెడ్డి, తాడూరు వెంకట రమణయ్య, మాజీ సర్పంచ్ ఈశ్వరయ్య, మిద్దెపల్లి గోవిందు, జయన్న యాదవ్, సర్పంచ్ రామిరెడ్డి, రంగనాథం, బీజేపీ నాయకుడు వడ్డె మహారాజ్, జనసేన నాయకుడు బ్రహ్మం పాల్గొన్నారు.



కోట్ల సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకుడు వెంకోబరావు

టీడీపీలోకి 250 వైసీపీ కుటుంబాలు: డోన్ మండలంలో వైసీపీకి భారీ షాక్ తగిలింది. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో కోట్ల సమక్షంలో వైసీపీ సీనియర్ నాయకుడు చనుగొండ్ల వెంకోబరావు, బజారితో పాటు మరో 150 వైసీపీ కుటుంబాలు టీడీపీలో చేరాయి. పట్టణంలోని మాజీ కౌన్సిలర్ శోభారాణితోపాటు కలచట్ల గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్తలు రాజేంద్ర, రమేష్, నాగార్జున, చిరంజీవి, రంగస్వామితో పాటు మరో 50 కుటుంబాలు టీడీపీలో చేరారు. ఎద్దుపెంట గ్రామంలో సీపీఐ కార్యకర్తలు గున్నం మీది నాగప్ప, నారాయణ, చింతలకొండ రామాంజిని, కుసలన్న, ఈరన్న ఆచారితో పాటు మరో 50 కుటుంబాలు టీడీపీలో చేరాయి. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వై.నాగేశ్వరరావు యాదవ్, మాజీ జడ్పీ చైర్మన్ బత్తిన వెంకట్రాముడు, కేఈ రుద్రఫణి, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ లక్ష్మీరెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ రాజా నారా యణమూర్తి, ఓబులాపురం శేషిరెడ్డి, మర్రి రమణ, చంద్రపల్లి ఆచారి, ఎర్ర గుంట్లపల్లి రమేష్ రెడ్డి, న్యాయవాది లక్ష్మన్న పాల్గొన్నారు.

జగన్ పాలనపై ప్రజల్లో తిరుగుబాటు

ప్యాపిలి: జగన్ పాలనపై ప్రజల్లో తిరుగుబాటు వచ్చిందని, ఎప్పుడు ఎన్నిలొచ్చిన వైసీపీని ఇంటికి సాగనంపడం ఖాయమని డోన్ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి, మాజీ మంత్రి కేఈ ప్రభాకర్ ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం మండలంలోని జలదుర్గం, గోపాల్‌నగరం గ్రామాల్లో వారు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. వై నాగేశ్వరరావు యాదవ్, కేఈ రుద్రఫణి, ఆర్ఈ నాగరాజు, ఆర్ఈ రాఘవేంద్ర, రమణగౌడు, విష్ణువర్ధన్, తిరుపాలునాయుడు, సలాం, నబీరసూల్ పాల్గొన్నారు.



జలదుర్గంలో ప్రచారం చేస్తున్న కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి, కేఈ ప్రభాకర్

డోన్(రూరల్): తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అర్చకులకు న్యాయం చేస్తామని డోన్ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి హామీ ఇచ్చారు. శుక్రవారం బ్రాహ్మణ సంఘం సభ్యులు కోట్లను కలిసి సమస్యను వివరించారు. బ్రాహ్మణ సంఘం సభ్యులు శేషావలి శర్మ, సుబ్రహ్మణ్యం శర్మ, బాల సుబ్బయ్య శర్మ, నాగభాస్కరశర్మ, హరి, విజయ శర్మ, శ్రీధర్‌భట్టు పాల్గొన్నారు.

టీడీపీతోనే సుపరిపాలన: కోట్ల సుజాతమ్మ

బేతంచెర్ల: రాష్ట్రంలో టీడీపీతనే ప్రజలకు సుపరిపాలన సాధ్యమని మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ అన్నారు. శుక్రవారం టీడీపీ పట్టణ అధ్యక్షురాలు బుగ్గన ప్రసన్నలక్ష్మి అధ్యక్షతన పట్టణంలోని బోయపేట, తాసిల్‌పేట, చాకలిపేట, అంగళ్ల మెయిన్‌బజారు ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించి సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. టీడీపీ ప్రధాన కార్యదర్శి షేక్షావలి చౌదరి, తిరుమలేష్ చౌదరి, నారాయణ స్వామి లోకేశ్‌గౌడు, రామనాథం తదితరులు పాల్గొన్నారు.

- బేతంచెర్ల పట్టణం దుర్గాపేటలో ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షుడు గూటం శివ అధ్యక్షతన టీడీపీ పట్టణ ప్రధాన కార్య దర్శి షేక్షావలి చౌదరి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ నంద్యాల మధు, మైనార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి వల్లి, కార్యకర్తలు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

డోన్(రూరల్), మే 3: శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని ట్రైనింగ్ డీఎస్పీ రఘువీర్ హెచ్చరించారు. శుక్రవారం సాయంత్రం మండలంలోని దొరపల్లె గ్రామంలో పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్‌తో కలిసి పోలీసు కవాతు నిర్వహించారు.

'టీడీపీ విజయం తథ్యం'

దొర్నిపాడు, మే 3: సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ విజయం తథ్యమని ఆళ్లగడ్డ టీడీపీ నాయకులు భార్గవ్‌రామ్‌నాయుడు అన్నారు. మండలంలోని చాకరాజువేముల గ్రామానికి చెందిన సురేష్, శివకుళాయి, ప్రసాద్, లక్ష్మీనరసింహుడు, 30 కుటుంబాలు ఆళ్లగడ్డలోని భూమా నివాసంలో వైసీపీని టీడీపీలో చేరాయి.

'వైసీపీకి రోజులు దగ్గర పడ్డాయి'

చాగలమర్రి, మే 3: రాష్ట్రంలో వైసీపీకి రోజులు దగ్గరపడ్డాయని టీడీపీ నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, నరేంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం నంద్యాల జిల్లా కేంద్రంలో జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఏర్పాటు చేసిన యువగళం కార్యక్రమానికి చిన్నవంగలి, చాగలమర్రి తదితర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు.

టీడీపీ నాయకుడి మృతికి నివాళి

చాగలమర్రి, మే 3: ముత్యాలపాడు గ్రామానికి చెందిన బాచుపల్లె లింగన్న (70) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందడంతో టీడీపీ మండల కన్వీనర్ నరసింహారెడ్డి, మాజీ సర్పంచ్ లక్ష్మీరెడ్డి నివాళి అర్పించారు. లింగన్న ఇంటి వద్దకు వెళ్లి మృతదేహంపై పూలమాల వేసి సంతాపం తెలిపారు.

చాగలమర్రిలో 46 డిగ్రీల ఉష్ణోగ్రత

చాగలమర్రి, మే 3: జిల్లాలో గతంలో ఎన్నడూ లేనివిధంగా రికార్డు స్థాయిలో పగటి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. చాగలమర్రి మండలంలో శుక్రవారం 46 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోండి

సంజామల, మే 3: మండలంలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ రమాదేవి అధికారులను కోరారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో నాగకుమార్ అధ్యక్షతన వహించారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఏవో విజయకుమార్‌రెడ్డి, వ్యవసాయాధికారి సుధాకర్‌రెడ్డి, ఏపీవో సూర్యప్రకాశ్ పాల్గొన్నారు.

మట్టి రోడ్డు పరిశీలన

రుద్రవరం, మే 3: ఆలయ భూమిలో వేసిన రోడ్డును దేవదాయశాఖ ఈవో వేణునాథరెడ్డి శుక్రవారం పరిశీలించారు. వైసీపీ నాయకుడా మజాకా, ఆలయ మాన్యం భూముల్లో మట్టి రోడ్డు అనే శీర్షికతో ఈ నెల 2న ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. ఈవో మాట్లాడుతూ అనుమతి లేకుండా దేవాలయ భూమిలో మట్టిరోడ్డు వేయడం చట్టరీత్యా నేరమన్నారు. సర్వే చేయించి మట్టి రోడ్డును తొలగిస్తామన్నారు.

గెలుపే ధ్యేయంగా పని చేయాలి: అఖిలప్రియ





బోయలకుంట్లలో ప్రచారం చేస్తున్న భూమా అఖిలప్రియ, టీడీపీలో చేరిన వారితో అఖిలప్రియ

నంద్యాల, మే 3(ఆంధ్రజ్యోతి): టీడీపీ గెలుపే ధ్యేయంగా పని చేయాలని ఆ పార్టీ అభ్యర్థి భూమా అఖిలప్రియ పిలుపునిచ్చారు. ఆళ్లగడ్డ పట్టణంలోని ఆమె స్వగృహంలో రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి సుధాకర్ ఆధ్వర్యంలో మణికంఠ, ప్రసాద్‌తో పాటు 25 కుటుంబాలు వైసీపీని వీడి అఖిలప్రియ సమక్షంలో టీడీపీలో చేరాయి.

- ఆళ్లగడ్డ మండలంలోని కోటకందుకూరు గ్రామానికి చెందిన నడిపి సుబ్బరాయుడు, అశోక్, రాజు వారి కుటుంబ సభ్యులు పట్టణంలోని మాజీ మంత్రి అఖిలప్రియ స్వగృహంలో భార్గవ్‌రామ్‌నాయుడు సమక్షంలో టీడీపీలో చేరారు. వీరికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

భూ హక్కు చట్టంతో ఇబ్బందులు

వైసీపీ ప్రభుత్వం భూ హక్కు చట్టం తెస్తే ఇబ్బందులు తప్పవని మాజీ మంత్రి అఖిలప్రియ అన్నారు. ఆళ్లగడ్డ పట్టణంలోని ఆమె స్వగృహంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వం భూ హక్కు చట్టం తెచ్చిందని, పైగా ఈ చట్టం కేంద్ర ప్రభుత్వం తెచ్చిందని ఆ పార్టీ నాయకులు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని చెప్పారు. ఈ చట్టం అమలులోకి వస్తే ప్రజలు తమ భూములను అమ్ముకోవాలంటే ఇబ్బందులు తప్పవని, ఈ చట్టాన్ని అమలు చేసేందుకు నియమించే ఓ ప్రత్యేక అధికారి చెప్పుచేతల్లోకి వెళ్తుందని అన్నారు. అంతేకాకుండా ఆ అధికారి ద్వారా ప్రజల భూములను ప్రభుత్వం లాక్కొని బ్యాంకుల్లో పెట్టే ప్రమాదం ఉందన్నారు. ఇలాంటి వారికి మరోసారి అవకాశం ఇస్తే మనమంతా ఇబ్బందులు పడతామని, ఈ ఎన్నికల్లో వైసీపీ నాయకులకు ఓటు ద్వారా బుద్ధి చెప్పాలని ఆమె ప్రజలకు సూచించారు. సమావేశంలో శిరివెళ్ల టీడీపీ నాయకుడు యామా గురప్ప పాల్గొన్నారు.

వైసీపీకి గుణపాఠం తప్పదు: అఖిలప్రియ

శిరివెళ్ల: రాష్ట్ర ప్రజల సంక్షేమం మరిచిన వైసీపీకి రానున్న ఎన్నికల్లో గుణపాఠం తప్పదని మాజీ మంత్రి, టీడీపీ ఆళ్లగడ్డ నియోజకవర్గ అభ్యర్థి భూమా అఖిలప్రియ అన్నారు. ప్రజాగళంలో భాగంగా మండలంలోని బోయలకుంట్ల, మహదేవపురం గ్రామాల్లో ఆమె శుక్రవారం ప్రచారం చేశారు. రాష్ట్రంలోని అన్ని రంగాలను అభివృద్ధి చేయాలన్నా.. అన్ని వర్గాల ప్రజలకు మంచి జరగాలన్నా టీడీపీ అధినేత నారా చంద్రబాబు సీఎంగా చేసుకోవాలన్నారు. రాక్షస పాలనతో విసిగిపోయిన ప్రజలు స్వచ్ఛందంగా టీడీపీలోకి తరలి వస్తున్నారన్నారు. ఉద్యోగాల కల్పనలో భాగంగా డీఎస్సీ నిర్వహణ, రైతుల భూములను కాపాడేందుకు ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దుకు టీడీపీ కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ శ్రీకాంత్‌రెడ్డి, మురళి, వెలుగోడు మహేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

'చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి'

చాగలమర్రి: చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఆళ్లగడ్డ టీడీపీ నాయకుడు భూమా జగత్ విఖ్యాతరెడ్డి అన్నారు. శుక్రవారం నగల్లపాడులో గ్రామానికి చెందిన రాధాకృష్ణ, వెంకటసుబ్బయ్య, పుల్లారెడ్డి, మల్లేశ్వర్‌రెడ్డితో పాటు 10 కుటుంబాలు టీడీపీలో చేరాయి. జగత్‌విఖ్యాత్ రెడ్డి మాట్లాడుతూ వైసీపీ పాలనకు రోజులు దగ్గరపడ్డాయని అన్నారు. ఎన్నికల్లో ప్రజలే వైసీపీకి తగిన గుణపాఠం చెబుతారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నరసింహారెడ్డి, నాగరాజు, పెద్ద దస్తగిరి, బాల దస్తగిరి, బ్రహ్మానందరెడ్డి, శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అఖిల ప్రియకు మద్దతుగా అత్త ప్రచారం

రుద్రవరం: ఆళ్లగడ్డ టీడీపీ అభ్యర్థి భూమా అఖిలప్రియ సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని టీడీపీ నాయకుడు భార్గవరామ్ నాయుడు తల్లి కిరణ్మయి శుక్రవారం ఇంటింటిప్రచారం చేశారు. ఆలమూరు గ్రామంలో ఇంటింటికీ తిరిగి సూపర్‌సిక్స్ పథకాలు వివరించారు. అభివృద్ధి చంద్రబాబు నాయకత్వం రాలవాలని అన్నారు. కార్యక్ర మంలో నారాయణ, సత్యనారాయణ, బ్రహ్మయ్య పాల్గొన్నారు.



నగల్లపాడులో భూమా జగత్ విఖ్యాతరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు